సాక్షి నారాయణపేట

ఆదివారం । 25 । జూన్ । 2023



ఐబీసీసీ పేరిట దోపిడీ

గద్వాల జిల్లాలో నిత్యం ఏదో ఒక మోసం వెలుగుచూడటం పరిపాటిగా మారింది.

వివరాలు 8లో ▸



వృత్తి పన్ను రద్దు చేయాలి

ఎల్ఐసీ ఏజెంట్లతో వసూలు చేస్తున్న వృత్తి పన్ను రద్దు చేయాలని శ్రీనివాసచారి అన్నారు.

వివరాలు 10లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం 34.0 /22.4

రోజంతా ఆకాశం మేఘావృతమై చిరుజల్లులు పడతాయి. సాయంత్రం ఉరుములతో కూడిన వర్షం పడే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

కళాశాలలో మౌలిక వసతుల పరిశీలన

మాగనూర్: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలను జిల్లా సెషన్స్‌జడ్జి జే. శ్రీనివాసులు శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా కళాశాలల్లో కల్పిస్తున్న సౌకర్యాలపై హైకోర్టులో పిల్ దాఖలైందని అన్నారు. అందులో భాగంగానే మాగనూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలను తనిఖీ చేయడం జరిగిందన్నారు. కళాశాల సిబ్బందిని అడిగి వివరాలు సేకరించారు. కళాశాల గదులు, సౌకర్యాలపై హైకోర్టుకు నివేదిస్తామన్నారు. కార్యక్రమంలో మాగనూర్ ఎస్ఐ కే. మల్లేష్ , కళాశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కోర్టు డ్యూటీ ఆఫీసర్లతో సమీక్ష

నారాయణపేట రూరల్: నేరస్తులకు తగిన శిక్ష పడేవిధంగా చూసే బాధ్యత కోర్టు డ్యూటీ అధికారులదేనని జిల్లాలోని ఆయా ఎస్‌హెచ్‌ఓలు అన్నారు. జిల్లాలోని అన్ని పీఎస్‌లలో కోర్టు డ్యూటీ నిర్వహిస్తున్న పోలీసు ఆఫీసర్లకు శనివారం ఆయా పోలీసు స్టేషన్లలో రివ్యు మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా దర్యాప్తు, ప్రాసిక్యూషన్, ఇన్వెస్టిగేషన్ చేయాల్సిన పద్ధతిని వివరించారు. సాక్షులు, నిందితులను కోర్టుకు హాజరు పరిచే విధానం, సకాలంలో కేసులు పూర్తి అయ్యేవిధంగా తీసుకోవాల్సిన చర్యలు తెలియచేశారు. పోలీసు వ్యవస్థపై నమ్మకం కల్పించాలని, కోర్టు ఆదేశాలను తూచా తప్పకుండా పాటించాలని తెలిపారు. కోర్టు సిబ్బందితో సమన్వయంతో ముందుకు పోవాలన్నారు.

అంధుల ఆశ్రమ పాఠశాలలో ప్రవేశాలు

నారాయణపేట: రాష్ట్ర ప్రభుత్వం దివ్యాంగులు, వయోవృద్ధులు, ట్రాన్స్ జెండర్స్ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో మహబూబ్‌నగర్‌లో అంధుల కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక ఆశ్రమ పాఠశాల, కళాశాలలో అర్హులైన అంధ విద్యార్థుల నుంచి ప్రవేశాలు కోరుతున్నట్లు ప్రిన్సిపాల్ ఓ.రాములు ఒక ప్రకటనలో తెలిపారు. 2023–24 విద్యా సంవత్సరానికిగాను అంధ విద్యార్థినీ, విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని, పాఠశాలలో 1వ తరగతి నుంచి 10వరకు చేరుటకు 6ఏళ్ల నుంచి 14ఏళ్ల వయస్సు కలిగిన వారు అర్హులని, 1వ తరగతి నుంచి 6వ తరగతి వరకు ఆంగ్ల మాధ్యమం (ఇంగ్లీష్ మీడియం)లో బోధన కొనసాగుతుందని తెలిపారు. విద్యార్థులు కనీసం 40 శాతం శాశ్వత అంధత్వ ధృవపత్రం కలిగి ఉండాలని, బాల బాలికలకు వేర్వేరు వసతి సౌకర్యాలతో ఉచిత భోజన వసతి ఉందని, విద్య అభ్యాసానికి సామగ్రి ఉచితంగా అందిస్తారని, ప్రత్యేక శిక్షణ పొందిన ఉపాధ్యాయులు బోధిస్తారని, ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌లో ఉచిత కంప్యూటర్ శిక్షణ ఇస్తారని తెలిపారు. వివరాలకు మహబూబ్‌నగర్‌లోని ప్రభుత్వ అంధుల ఆశ్రమ పాఠశాల, కళాశాల పిల్లలమర్రి రోడ్, సెల్ నం. 9618243794 సంప్రదించాలని కోరారు.

పలు రైళ్ల రద్దు

స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లా మీదుగా పలు రైళ్లు రద్దు అయ్యాయి. 17251 గుంటూరు–కాచిగూడ రైలు ఈనెల 27వ తేదీ నుంచి వచ్చేనెల 5 వరకు, 17252 కాచిగూడ–గుంటూరు రైలు ఈనెల 28 నుంచి వచ్చేనెల 6 వరకు రద్దు చేశారు. అదే విధంగా 07583 కాచిగూడ–మహబూబ్‌నగర్ రైలు, 07584 మహబూబ్‌నగర్–కాచిగూడ రైలు ఈనెల 26 నుంచి వచ్చేనెల 2 వరకు ఉందానగర్ నుంచి మహబూబ్‌నగర్ వరకు తాత్కాలికంగా రద్దు చేశారు.

అభయారణ్యంలోకి అనుమతులు రద్దు

మన్ననూర్: పెద్ద పులుల సంతానోత్పత్తికి అనుకూలమైన రోజులుగా పరిగణిస్తూ ఎన్‌టీసీఏ ఆదేశాల మేరకు అమ్రాబాద్ పులుల రక్షిత అభయారణ్యంలో జూలై 1 నుంచి జన సంచారానికి అనుమతులు రద్దు చేస్తున్నట్లు డీఎఫ్ఓ రోహిత్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 2,611 చ.కి.మీ., విస్తీర్ణం కలిగిన అమ్రాబాద్ అభయారణ్యంలో ప్రస్తుతం 12 ఆడ, 18 మగ పెద్ద పులులతోపాటు పులి పిల్లలు ఉన్నాయన్నారు. జనసంచారం, వాహనాల శబ్దాలు వింటే పులులు, చిరుతలు ఆందోళనకు గురై దూర ప్రాంతాలకు తరలివెళ్లే ప్రమాదం ఉంటుందన్నారు. జూలై, ఆగస్టు, సెప్టెంబర్ నెలలు ప్రత్యేకించి పెద్దపులులు సంతానోత్పత్తి దిశగా కలుసుకునే సమయం అన్నారు. పులుల మనుగడే పుడమికి ఆధారం అనే విధానాన్ని అటవీశాఖ అనుసరిస్తూ వన్య ప్రాణుల సంరక్షణ చర్యలు పూర్తిస్థాయిలో చేపడుతుందన్నారు. ఈ క్రమంలో సుమారు 90 రోజులపాటు పులుల సంచారానికి ఎలాంటి అంతరాయం లేకుండా ప్రశాంత వాతావరణం కల్పించాల్సిన బాధ్యత తమపై ఉందన్నారు. పర్యాటకుల కోసం ఏర్పాటు చేసిన టైగర్ సఫారీని సైతం ఈ మూడు నెలల పాటు పూర్తిగా నిలిపివేస్తామన్నారు. అలాగే శ్రీశైలం– హైదరాబాద్ ప్రధాన రహదారిలోని దోమలపెంట, మన్ననూర్ అటవీశాఖ చెక్‌పోస్టు వద్ద రాత్రి 9 తర్వాత రాకపోకలను నిషేధిస్తామన్నారు.

ఆందోళన వద్దు.. అదను దాటలేదు

జూలై 15వరకు విత్తనాలు విత్తుకోవచ్చు

- పంట మార్పిడితో అధిక దిగుబడి
- నకిలీ విత్తనాలతో అప్రమత్తత అవసరం
- విత్తనాలు, ఎరువులకు బిల్లులు తీసుకోండి
- ఆయిల్‌పాం, పండ్లు, కూరగాయల తోటల సాగుపై దృష్టి సారించాలి
- 'సాక్షి' ఫోన్ ఇన్‌లో వ్యవసాయశాఖ జిల్లా అధికారి జాన్‌సుధాకర్

రుతుపవనాల రాక ఆలస్యం కావడం.. వరుణుడి జాడే లేకపోవడంతో ఎన్నో ఆశలతో సాగుకు భూములు సిద్ధం చేసిన రైతుల్లో కొంత ఆందోళన నెలకొంటుందని.. కానీ, ఎలాంటి ఆందోళన చెందవద్దని, ఇంకా అదను దాటలేదని జిల్లా వ్యవసాయశాఖ అధికారి జాన్‌సుధాకర్ పేర్కొన్నారు. వచ్చే నెల 15 వరకు వివిధ రకాల పంటలు వేసుకోవచ్చని, వ్యవసాయాధికారుల సలహాలు, సూచనలు పాటించాలని, వీలైనంత వరకు పంట మార్పిడి చేయాలని అప్పుడే అధిక దిగుబడి సాధించవచ్చని సూచించారు. విత్తనాల ఎంపికలో జాగ్రత్తలు పాటించాలని, 70 నుంచి 110 మి.మీ. వర్షం పడితేనే విత్తనాలు విత్తేందుకు అనువుగా ఉంటాయన్నారు. శనివారం ఉదయం 11 గంటల నుంచి 12 గంటల వరకు 'సాక్షి' ఆధ్వర్యంలో నిర్వహించిన ఫోన్ ఇన్‌కి రైతుల నుంచి విశేష స్పందన లభించింది. వారు అడిగిన ప్రశ్నలకు డీఏఓ సమాధానాలు ఇచ్చారు. ఆ వివరాలిలా.. – నారాయణపేట



రైతులతో ఫోన్‌లో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయ శాఖ అధికారి జాన్‌సుధాకర్

'సాక్షి' ఫోన్ ఇన్

ప్రశ్న: భూసార పరీక్షలు ఎప్పుడు చేసుకోవాలి, ఏఏ పంటలు వేసుకోవచ్చు?
– ఆంజనేయులు, గోకుల్‌నగర్

డీఏఓ: భూసార పరీక్షలు ఏప్రిల్, మేలోనే చేసుకోవాలి. అప్పుడే ఫలితాలు బాగా వస్తాయి. వర్షాలు పడినప్పుడు తేమ ఉంటే ఆ భూముల్లో భూసార పరీక్షలు చేయడం కుదరదు. భూసార పరీక్ష కేంద్రం ఏర్పాటుకు ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపించాం. ఇప్పుడు జొన్న తప్పా ఏ పంటలైనా వేసుకోవచ్చు.

ప్రశ్న: పత్తి పంట వేయవచ్చా?
– ఆంజనేయులుగౌడ్, ముస్లాపేట

డీఏఓ: ఒట్టి భూముల్లో రైతులు పత్తి విత్తనాలు పెడితే... వానొస్తే అదృష్టం. లేదంటే విత్తనాలు మొలిచే అవకాశం ఉండదు. మృగశిర కార్తెలోపు వర్షాలు పడకపోవడంతో బెంగ పడాల్సిన పనిలేదు. మరో 15 రోజుల పాటు పత్తి విత్తుకునే అవకాశం ఉంది. నాగటిసాళ్లు వచ్చే వర్షం పడాలి. తేలికపాటి భూముల్లో 70 మి.మీ., రేగడి భూముల్లో 110 మి.మీ. వర్షం పడితే విత్తనాలు విత్తాలి. జూలై 15 వరకు అన్ని పంటలకు విత్తనాలు వేసే అవకాశం ఉంది. వానలు రాలేదని రైతులు ఆందోళన పడొద్దు.

ప్రశ్న: కలుపు నివారణకు ఏ మందులు వాడాలి ?
– సూర్యనాయక్, స్వాములవారి తండా

డీఏఓ: వట్టి మట్టిలో విత్తనం వేస్తే తేమ ఉండాలి. కంది, పత్తి ఇతర పంటలు వేసిన 48 గంటల్లో పెండి మిథాలిన్ ఎకరానికి లీటర్ పిచికారీ చేయాలి. ఆ తర్వాత మందులను పిచికారీ చేయాలనుకుంటే రైతు వేదికల్లో ఏఈఓలను సంప్రదించి వారి సలహాలు, సూచనలు తప్పని సరిగా తీసుకోవాలి.

ప్రశ్న: అధిక దిగుబడికి ఏ రకం పత్తి విత్తనాలు వేయాలి ?
– ప్రభాకర్‌రెడ్డి, వద్వాట్

డీఏఓ: దిగుబడి అనేది భూ సారాన్ని బట్టి, యాజమాన్య పద్ధతులు, కలుపు లేకుండా చూసుకోవడం, సమయానికి ఎరువులు వేయడంతో వస్తుంది. అన్ని కంపెనీలకు సంబంధించిన పత్తి విత్తనాలు బీటీ రకాలే. పత్తి బెట్ట కాకుండా 19.19.19, నానో యూరియా, నానో డీఏపీలను పైపాటు పిచికారీ చేయాలి.

ప్రశ్న: పత్తి విత్తనాల కొనుగోళ్లలో జాగ్రత్తలు వివరించండి – బసంత్‌రెడ్డి, వద్వాట్

డీఏఓ: లైసెన్స్ ఉన్న డీలర్ల వద్దనే పత్తి, ఇతర పంటల విత్తనాలను కొనుగోలు చేయాలి. జీఈఏసీ అప్రోల్‌తోపాటు విత్తనాల ప్యాకెట్‌పై సుటేబుల్ ఫర్ తెలంగాణ లాట్‌నంబర్ ఉంటేనా కొనాలి. రషీదు తీసుకోవాలి. బీజీ సెకండ్ విత్తనాలను కొనుగోలు చేయవచ్చు. పంట కాలం పూర్తి అయ్యే వరకు ఆ విత్తనాల ప్యాకెట్లను భద్రపరుచుకోవాలి. ఏదైనా విత్తన లోపంతో పంట దెబ్బతింటే కంపెనీపై చర్య తీసుకునే అవకాశం ఉంటుంది.

ప్రశ్న: పంటలపై అవగాహన కల్పించాలి?
– రంగారెడ్డి, అప్పిరెడ్డిపల్లి

డీఏఓ: రైతు వేదికల సిజన్ వారీగా రైతులకు పంటలపై అవగాహన కల్పిస్తున్నాం. వీఏఓలు, ఏఓలు క్షేత్రస్థాయిలో గ్రామాలకు వెళ్లి విత్తనాలు శుద్ధి చేయడం, విత్తే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పంటల సస్యరక్షణపై అవగాహన కల్పిస్తాం.

ప్రశ్న: చవుడు భూముల్లో ఎలాంటి పంటలు వేసుకోవచ్చు?
–నర్సింహులు, ఊట్కూర్

డీఏఓ: ఆ భూముల్లో ఎట్టి పరిస్థితుల్లో కందితోపాటు పప్పు దినుసుల పంటలు వేయరాదు. పత్తి, సజ్జలు, తెల్లకుసుమలు వేసుకోవచ్చు. జీలుగ వేయడంతో సత్వా వస్తుంది.

ప్రశ్న: ఏఏ వరి రకాలు వేసుకోవచ్చు ?
– రాజిరెడ్డి, హన్మన్‌పల్లి

డీఏఓ: జూన్ 15 వరకే బీపీటీ సోనా రకం వరి ధాన్యానికి నారుపోసుకోవాలి. ఆ తర్వాత పోసుకుంటే వాటికి రోగాలు వస్తాయి. సన్నరకం ధాన్యం ఆర్ఎన్ఆర్, కెఎన్ఎం, దొడ్డురకం 1010ని జూలై 15 వరకు నారుపోసుకోవాలి. వరి నారుమడిలో ఒడిపిలి నివారణకు నామిని గోల్డు వాడాలి.

ప్రశ్న: నల్ల రేగడిలో నేలల్లో ఏ పంటలు వేసుకోవచ్చు ?
– వెంకట్, ఊట్కూర్

డీఏఓ: నల్ల రేగడి నేలలు జొన్న, పత్తి పంటలకు అనువైనవి. నీటి నిల్వ ఉంచుకునే శక్తి ఉంటుంది. అధిక దిగుబడి సాధించడానికి, భూ సంరక్షణకు దున్నడంలో కొత్త సాంకేతిక పద్ధతులను అనుసరించాలి.

ప్రశ్న: విత్తనాలపై సబ్సిడీ ఉందా ?
– మహిపాల్‌రెడ్డి, ఓబ్లాపూర్

డీఏఓ: ప్రస్తుతం ఏ విత్తనాలపై సబ్సిడీ లేదు. జీలుగపై 65 శాతం సబ్సిడీ వస్తుంది. ప్రతి ఎకరానికి రూ. 5 వేలు ప్రభుత్వం రైతు బంధుతో పెట్టుబడులకు ప్రోత్సహించేందుకు వేస్తుంది.

ప్రశ్న: చలక భూముల్లో ఇది వరకు పత్తి వేశాం. ఇప్పుడేం ఏ పంట వేయాలి ?
– రామకృష్ణారెడ్డి, పర్సాపూర్

డీఏఓ: పంట మార్పిడి చేస్తే బావుంటుంది. కంది వేసుకోవచ్చు, పత్తి వేసుకున్న బెట్టకు గురైతే వాటికి 19.19.19 కొట్టాలి.

ప్రశ్న: ఆముదం, పొద్దుతిరుగుడు విత్తనాలు ఏవి వేయాలి ? – వెంకటేష్, ఊట్కూర్

డీఏఓ: జ్వాల, జ్యోతి, కిరణ్, పీసీఎస్–262, –111, డీసీహెచ్–177, పొద్దుతిరగుడులో ఏపీఎస్‌హెచ్ –11, కేబీఎస్‌హెచ్–1, ఎస్‌డీఎస్‌హెచ్–1, డీఆర్ఎస్‌హెచ్–1 వేసుకోవచ్చు.

ప్రశ్న: కంది, పెసరలో ఏఏ రకాలు అనువైనవి ?
– లక్ష్మణ్ నాయక్ , పేరపళ్ల

డీఏఓ: కందిలో కొలంబో, డబ్ల్యూఆర్‌జీ 93 (తెలంగాణ కంది), పీఆర్‌జీ–100, పీఆర్‌జీ–158, పీఆర్‌జీ 175, మారుతి, ఆర్‌జీపీ–1, పెసరలో యాదాద్రి(డబ్ల్యూజీజీ42), టీఎం–96–2, ఎంజీజీ295, ఎంజీజీ 347 విత్తుకోవచ్చు. తెల్ల కందులు విత్తితే ట్రైకోడర్మవికోతో విత్తనశుద్ధి చేసుకోవాలి.

ప్రశ్న: కూరగాయలు, పండ్ల తోటలకు ఏ పొలాలు అనువైనవి ?
– వెంకోభ, బీకేఎస్ నాయకులు

డీఏఓ: ఎర్ర చలక నెలలు కూరగాయలు, పండ్ల తోటలకు అనువైనవి. జిల్లాలో దామరగిద్ద, మద్దూర్, కోస్గి, నారాయణపేట మండలాల్లో రైతులు కూరగాయలు, పండ్ల తోటలపై దృష్టి సారించాలి. బొప్పాయి, మామిడి, బత్తాయి తదితర పండ్ల తోటలతోపాటు అన్ని కూరగాయలు పండించుకోవచ్చు. ఇప్పుడు మొక్కజొన్న సైతం వేసుకోవచ్చు.

ప్రశ్న: ఎర్రచలక నేలల్లో ఎలా సాగు చేసుకోవాలి – ఆశన్న, మరికల్

డీఏఓ: ఎర్ర చలకనేలల్లో నీరు నిల్వ ఉండే సామర్థ్యం తక్కువ. మెట్టలో భూ సంరక్షణ ముఖ్యం. దుక్కి దున్నడం, విత్తడం, అంతర కృషి చేయడంతో నీటి వరవడిని ఎక్కడిక్కడే అరికట్టి ఎక్కువ నీటిని భూమిలోకి ఇంకింపజేయాలి. ఈ నేలల్లో వేరుశనగ ఊడలు సులభంగా దిగి కాయలు ఊరుతాయి. వాననీరు భూమిలోకి ఇంకి వృథా తగ్గుతుంది.

ప్రశ్న: అలచంద, సజ్జ, కొర్ర, జొన్నలో ఏ రకం విత్తనాలు వాడోచ్చు ?– అంజప్ప, దామరగిద్ద

డీఏఓ: అలచందలో జీసీ3, వీ240, సీ152, కో4 విత్తనాలు, జొన్నలో సీఎస్‌హెచ్25, సీఎస్‌హెచ్16, సీఎస్‌హెచ్30, పీఎస్‌వి–56, సీఎస్‌వి–31, సీఎస్‌వి27 విత్తనాలు, సజ్జలో ఐసీఎంవీ 221, ఐసీటీపీ8203, పీహెచ్‌బీ3, కొర్రలో సూర్యనంది, ఎస్ఐఏ 3156, ఎస్ఐఏ 3085 విత్తనాలు వేసుకోవచ్చు.

ప్రశ్న: నువ్వులు, మినుములు, ఉలవలు ఏఏ రకం విత్తనాలు వేసుకోవాలి ? – శ్రీహరి, కానుకుర్తి

డీఏఓ: నువ్వుల్లో శ్వేత, రాజేశ్వరి, ఎలమంచిలి–66, చందన, జెసీఎస్–9428(హిమ). మినుములో ఎల్‌బీజీ623, ఎల్‌బీజీ762, ఎల్‌బీజీ20, పీయూ 31, ఎంబీజీ209, ఎల్‌జీబీ787, డబ్ల్యూజీజీ26. ఉలవలు పీహెచ్‌సీ9, పీడీఎం1, బీజెడ్ఎం1, పాలెం1, పాలెం2, పీహెచ్‌జీ62, పీఆర్‌హెచ్‌జీ19 వేసుకోవచ్చు.

ప్రశ్న: జీలుగ సాగు చేయడం ఎలా? చివరి దుక్కుల్లో ఎరువులు వేయవచ్చా?
– వెంకటప్ప, తిప్రాస్‌పల్లి

డీఏఓ: జీలుగ విత్తనాలతో భూమి సారవంతంగా సారానికి ఎంతో మేలు చేస్తుంది. జీలుగా సాగు చేసిన 25 నుంచి 45 రోజుల వ్యవధిలో పూత దశకు వస్తుంది. జీలుగను దుక్కిలో కలిపేయాలి. జీలుగ విత్తనాలు సబ్సిడీతో రైతులకు అందిస్తున్నాం. పంటలు విత్తే చివరి దుక్కిలో డీఏపీ, పొటాష్‌ను తగిన మోతాదులో వేసుకోవచ్చు.

విద్యతో పాటు క్రీడల్లోనూ రాణించాలి

మక్తల్: బాలబాలికలు విద్యతోపాటు క్రీడల్లోనూ రాణించాలని జిల్లా జడ్జి జి.శ్రీనివాసులు అన్నారు. శనివారం పట్టణంలో జిల్లా స్థాయి క్రీడాకారుల ఎంపిక పోటీలను జడ్జి ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ.. బాలికలు క్రీడల్లో ప్రతిభ కనబర్చాలని, రాష్ట్ర, జాతీయ స్థాయిలో రానిస్తే స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగాలు పొందవచ్చన్నారు. ప్రస్తుతం ఎంపికైన విద్యార్థులు 25న హైదరాబాద్ గౌలీపుర మైదానంలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. నారాయణపేట టగ్ ఆఫ్ వార్ పోటీల్లో ప్రతిభ కనబర్చిన బాలికలను అభినందించారు. కార్యక్రమంలో గోపాలం, తాన్‌సింగ్, సత్యఆంజనేయులు, ఏఎస్ఐ సంజీవయ్య, భాను ప్రకాష్ అంబ్రేస్, రమేష్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.



కరచాలనం చేస్తున్న జిల్లా జడ్జి శ్రీనివాసులు

ప్రజా రక్షణే పోలీసుల ప్రధాన లక్ష్యం



మొక్క నాటుతున్న డీఎస్పీ సత్యనారాయణ

కోస్గి: ప్రజల ధన, మాన, ప్రాణ రక్షణే ప్రధాన లక్ష్యంగా పోలీసులు పని చేయాలని డీఎస్పీ సత్యనారాయణ అన్నారు. వార్షిక తనిఖీల్లో భాగంగా శనివారం కోస్గి పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీస్ అధికారులు, సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించి సిబ్బంది ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. పోలీస్ రికార్డులను పరిశీలించి పలు సూచనలు చేశారు. విధి నిర్వహణలో ప్రతిభ చూపిన వారికి ప్రతినెల ఎస్పీ చేతుల మీదుగా రివార్డులు, అవార్డులు అందజేస్తామన్నారు. ఫిర్యాదుదారులతో మర్యాదగా మాట్లాడి వారి సమస్యను పరిష్కరించి పోలీస్‌లంటే భయపడే పరస్థితి నుంచి పోలీస్ అంటే గౌరవం అన్న స్థితికి రావాలన్నారు. అనంతరం పోలీస్ స్టేషన్ ఆవరణలో సీఐ, ఎస్సై, సిబ్బందితో కలిసి మొక్కలు నాటారు. ఇందులో సీఐ జనార్దన్, ఎస్సైలు శ్రీనివాస్, నరేష్, సిబ్బంది ఉన్నారు.

ఓటమి.. విజయానికి నాంది కావాలి

సివిల్స్ ర్యాంకర్ ఉమాహారతి



చిన్నపొర్ల ఉన్నత పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడుతున్న సివిల్స్ ర్యాంకర్ ఉమాహారతి

ఊట్కూరు: ఓటమి నుంచి గుణపాఠం నేర్చుకోవాలని.. విజయానికి బాటగా మలుచుకోవాలని సివిల్స్ 3వ ర్యాంకర్ ఉమాహారతి అన్నారు. శనివారం మండలంలోని చిన్నపొర్ల ఉన్నత పాఠశాలలో విద్యార్థులతో ప్రేరణా కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఎస్పీ ఎన్.వెంకటేశ్వర్లు కుమార్తె ఉమాహారతి నెలరోజుల క్రితం విడుదలైన యూపీఎస్సీ ఫలితాల్లో జాతీయ స్థాయిలో 3వ ర్యాంకు సాధించిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఎంచుకొని పట్టుదలతో చదువుకోవాలని అన్నారు. లక్ష్యాన్ని చేరుకునే మార్గంలో అనేక అవరోధాలు ఎదురవుతుంటాయని వాటికి భయపడి వెనకడుగు వెయ్యరాదని తెలిపారు. విజయం కోసం చేసే ప్రయత్నంలో ఓటములు ఎదురవుతుంటాయని, వాటితో మనం గుణపాఠాలు నేర్చుకొని అంతకంటే రెట్టింపు ఉత్సాహంతో ముందుకు సాగాలని అన్నారు. బాలికల విద్యాభ్యాసంలో చాలా అవరోధాలు ఎదరవుతుంటాయని భయపడకుండా లక్ష్యాన్ని చేరుకునేందుకు ప్రయత్నించాలని అన్నారు. అనంతరం విద్యార్థులు అడిగిన పలు ప్రశ్నలకు జవాబులిచ్చి విద్యార్థులను ఉల్లాసపరిచారు. అనంతరం ఉపాధ్యాయుల బృందంతో కలిసి పాఠశాల ప్రగతి గురించి, విద్యార్థుల స్థితిగతుల గురించి తెలుసుకున్నారు. తరగతి గదులను, మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో డీసీడీఓ పద్మానలిని, హెచ్ఎం సత్యనారాయణ, ఉపాధ్యాయులు నర్సింహ, శ్రీకాంత్, జగదీష్, గీత, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

పరేడ్‌తో శారీరక దృఢత్వం

నారాయణపేట రూరల్: పరేడ్‌తో పోలీసులకు శారీరక దృఢత్వం, క్రమశిక్షణ లభిస్తాయని, ప్రతి ఒక్కరు వీక్లి పరేడ్‌లో భాగస్వాములు కావాలని ఏఎస్పీ నాగేంద్రుడు అన్నారు. స్థానిక జిల్లా పోలీసు కార్యాలయ మైదానంలో శనివారం ఆర్మ్‌డ్ రిజర్వు పోలీసులు వీక్లి పరేడ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పాల్గొని మాట్లాడుతూ.. ప్రతి పోలీసు విధిగా వ్యాయామం చేయాలని, వారానికి ఒకసారి పరేడ్ నిర్వహించడంతో శారీరక దృఢత్వాన్ని పొందవచ్చన్నారు. అదేవిధంగా పోలీసులు ఉపయోగించే ఆయుధాల గురించి అవగాహన కల్పించారు.సమయపాలన, క్రమశిక్షణ అలవాటు చేసుకోవాలని, సర్వీసులో ఎమైన సమస్యలు ఉంటే ఎస్పీని కలిసి పరిష్కరించుకోవాలన్నారు. అంతకుముందు గౌరవ వందనం స్వీకరించారు. ఆర్ఐ విజయ్‌కుమార్, కృష్ణయ్య, ఇందిర, శివశంకర్, రిజర్వ్‌డ్ జిల్లా పోలీసులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు గుండుమాల్ విద్యార్థులు



విద్యార్థులను అభినందిస్తున్న హెచ్ఎం, ఉపాధ్యాయ బృందం

కోస్గి: గుండుమాల్ జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు జిల్లాస్థాయి అథ్లెటిక్ పోటీల్లో ప్రతిభ చాటి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఇంటర్నేషనల్ ఒలింపిక్స్ డే సందర్భంగా జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో నిర్వహించిన పోటీల్లో లాంగ్‌జంప్, 100 మీటర్ల పరుగులో దస్తమ్మ మొదటి స్థానం, రాధిక రెండో స్థానంలో నిలిచారు. షాట్‌పుట్ త్రోలో ఇంద్రజ రెండో స్థానంలో నిలిచింది. ముగ్గురు విద్యార్థులు జిల్లాస్థాయిలో ప్రతిభ చాటి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. విద్యార్థులను శనివారం పాఠశాల హెచ్ఎం వెంకట్రాముడు, పీఈటీ రాకేష్ శర్మ, సీఆర్పీ దస్తయ్య, ఉపాధ్యాయ బృందం అభినందించారు.

నేడు కందనూలులో నడ్డా సభ



నాగర్‌కర్నూల్‌లోని జెడ్పీ మైదానంలో బీజేపీ బహిరంగసభకు ముస్తాబవుతున్న సభాప్రాంగణం

- సాయంత్రం నాగర్‌కర్నూల్‌కు చేరుకోనున్న బీజేపీ జాతీయ అధ్యక్షుడు
- బహిరంగసభ కోసం జెడ్పీ మైదానం ముస్తాబు
- కేడర్‌లో జోష్ నింపుతుందంటున్న నాయకులు



సాక్షి, నాగర్‌కర్నూల్: బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీనడ్డా ఆదివారం నాగర్‌కర్నూల్ జిల్లాకు రానున్నారు. జిల్లాకేంద్రంలోని జెడ్పీ మైదానంలో సాయంత్రం బీజేపీ నిర్వహించనున్న భారీ బహిరంగసభకు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడతారు. సాయంత్రం 4.30 గంటలకు జిల్లాకేంద్రానికి హెలికాప్టర్ ద్వారా చేరుకుంటారు. బహిరంగ సభకు పెద్దఎత్తున జనాన్ని సమీకరించడంపై బీజేపీ దృష్టిపెట్టింది. ఆ పార్టీరాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుగ్యాల ప్రదీప్‌కుమార్, అధికార ప్రతినిధి కొల్లి మాధవి తదితర రాష్ట్ర నేతలు రెండు రోజులుగా నాగర్‌కర్నూల్‌లోనే మకాం వేసి సభా ఏర్పాట్లను దగ్గరుండి పరిశీలించారు. నాగర్‌కర్నూల్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ దిలీపాచారి, కొండ మణెమ్మ, నాగేశ్, జిల్లా అధ్యక్షుడు సుధాకర్‌రావు తదితర నేతలంతా జన సమీకరణపై దృష్టిపెట్టారు.

మోదీ తొమ్మిదేళ్ల పాలనపై నివేదన..

దేశంలో బీజేపీ ప్రభుత్వ పాలన తొమ్మిదేళ్లు పూర్తిచేసుకున్న సందర్భంగా తమ ప్రభుత్వ పాలనలో చోటుచేసుకున్న ప్రగతిని ప్రజలకు క్షేత్రస్థాయిలో నివేదించాలని బీజేపీ నిర్ణయించింది. ఇందుకోసం మహాజన్ సంపర్క్ అభియాన్ కార్యక్రమం కింద పార్లమెంట్ నియోజకవర్గ స్థానాలకు కేంద్ర మంత్రులను ఇన్‌చార్జ్‌లుగా నియమించి కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తోంది. నాగర్‌కర్నూల్ నియోజకవర్గ పరిధిలో కేంద్ర భారీ పరిశ్రమల శాఖ మంత్రి మహేంద్రనాథ్ పాండేకు బాధ్యతలు అప్పగించగా ఇప్పటికే ఆయన జిల్లాలో పలుమార్లు పర్యటించారు. కేంద్రం తమ తొమ్మిదేళ్ల పాలనలో చేసిన అభివృద్ధి, రాష్ట్రానికి కేటాయించిన నిధులను ప్రజలకు తెలియజేస్తూ ఇక్కడి కేడర్‌లో ఉత్సాహం నింపేలా జాతీయ అధ్యక్షుడు నడ్డా పర్యటన ఉంటుందని బీజేపీ శ్రేణులు భావిస్తున్నాయి.

కాషాయమయంగా మారిన కందనూలు

బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా కందనూలుకు రానుండటంతో పరిసర ప్రాంతమంతా కాషాయమయంగా మారింది. ప్రధాన రహదారులు కమలనాథుల ఫ్లెక్సీలు, తోరణాలతో నిండిపోయాయి. ప్రధాన రోడ్లు, చౌరస్తాలు, బస్టాండ్ కూడలి వద్ద భారీ కటౌట్లు, హోర్డింగులను సిద్ధం చేశారు. ఆదివారం వర్ష సూచన ఉన్న నేపథ్యంలో సభకు వచ్చేవారు తడవకుండా సభాప్రాంగణంపై రూఫ్ టాప్‌ను ఏర్పాటు చేశారు.

సభలతో కేడర్‌లో జోష్ నింపేలా..

కర్ణాటక ఎన్నికల తర్వాత రాష్ట్ర బీజేపీ పార్టీలో కొంత నైరాశ్యం ఉన్నట్టు కనబడుతోంది. ఎన్నికల ఏడాది కావడంతో రానున్న ఐదు నెలల్లో పార్టీని మరింత బలోపేతం చేయడంపై బీజేపీ జాతీయ నాయకత్వం దృష్టిపెట్టింది. సభలు, సమావేశాలు, పెద్దఎత్తున జనసమీకరణతో ప్రజల దృష్టిని ఆకర్షించాలనే యోచనలో ఉంది. ఇందులో భాగంగా జాతీయస్థాయి నేతలతో రాష్ట్రంలో సభలను నిర్వహించేలా ప్రణాళికలు సిద్ధం చేసినట్టు తెలుస్తోంది. నాగర్‌కర్నూల్ పార్లమెంట్ పరిధిలో జాతీయ అధ్యక్షుడు నడ్డా నిర్వహించనున్న బహిరంగ సభ ద్వారా ఉమ్మడి పాలమూరులో బీజేపీకి ఊపు తీసుకురావని బీజేపీ భావిస్తోంది.

క్లుప్తంగా

మహిళ ఆత్మహత్య

బిజినేపల్లి: తిమ్మాజిపేట మండలంలోని బుద్దసముద్రానికి చెందిన వివాహిత సుమలత(25) శుక్రవారం సాయంత్రం ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఇంట్లో ఎవరూ లేని సమయంలో వివాహిత ఇంట్లో ఉరేసుకుంది. కుటుంబ సభ్యులు వచ్చి చూసేసరికి ఇంట్లో వేలాడుతూ కనిపించగా.. వారు బోరున విలపించారు. ఆమె ఆత్మహత్యకు కారణాలు ఇంకా తెలియరాలేదు. ఈ విషయమై తిమ్మాజీపేట ఎస్ఐ షేక్ శంషోద్దీన్ సంప్రదించగా.. తమకు శనివారం సాయంత్రం వరకు ఫిర్యాదు రాలేదని, కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేయనున్నట్లు చెప్పారు. ఆమె భర్త, ఐదేళ్లలోపు ఇద్దరు కుమారులు ఉన్నారు.

చికిత్స పొందుతూ యువకుడు మృతి


సద్దాం (ఫైల్)

కోస్గి: కుటుంబ కలహాలతో పురుగుమందు తాగిన ఓ యువకుడు చికిత్స పొందుతూ శుక్రవారం అర్ధరాత్రి మృతిచెందాడు. గ్రామస్తుల కథనం మేరకు.. మండలంలోని హన్మాన్‌పల్లికి చెందిన సద్దాం హుస్సేన్ (32) ఆటో నడుపుతూ జీవనం సాగించేవాడు. ఆర్థిక సమస్యలతో కుటుంబంలో తరచూ గొడవలు జరిగేవి. ఈ క్రమంలో గురువారం రాత్రి గొడవ చోటు చేసుకోగా మనస్థాపానికి గురైన సద్దాం హుస్సేన్ శుక్రవారం పొలానికి వెళ్లి పురుగు మందు తాగాడు. కుటుంబ సభ్యులు వెంటనే కోస్గి ప్రభుత్వ ఆస్పత్రికి.. పరిస్థితి విషమంగా ఉండటంతో పాలమూర్ జిల్లా ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం అర్ధరాత్రి మృతిచెందాడు. సద్దాం హుస్సేన్‌కు భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు.

సిలిండర్ లీకై భార్యాభర్తలకు గాయాలు

తాడూరు: సిలిండర్ లీకై భార్యాభర్తలకు గాయాలన సంఘటన మండలంలోని చర్లతిరుమలాపురంలో శనివారం చోటుచేసుకుంది. గ్రామస్తుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి తిరుపతమ్మ వంటగదిలో వంట చేస్తుండగా.. సిలిండర్ లీకైంది. అనుమానం వచ్చి బయటకి వచ్చి మరో వ్యక్తి సాయం కోరింది. దీంతో వంట గదికి వచ్చిన ఆ వ్యక్తి కొంత సమయం ఆగి వంటగదికి వెళ్లాలని చెప్పి ఇరువురు బయటకు వచ్చారు. అనంతరం తిరుపతమ్మ వంట గదిలోకి వెళ్లి సిలిండర్‌ను ఆన్‌చేసే క్రమంలో లీకై మంటలు వ్యాపించాయి. దీంతో ఆమె కేకలు వేయగా భర్త యాదగిరి గౌడ్ వంటగదిలోకి వచ్చి భార్యను కాపాడే క్రమంలో ఆయనకు కూడా గాయాలయ్యాయి. చుట్టుపక్కల వారు గమనించి 108కు సమాచారం ఇవ్వగా.. వారిని జిల్లా ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం వారు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు.

వ్యక్తి రిమాండ్‌కు..

లింగాల: మండలంలోని మొగ్దుంపూర్‌కు చెందిన బాలిక కిడ్నాప్ ఘటనకు సంబంధించి అదే గ్రామానికి చెందిన ఒగ్గు గణేష్‌ను శనివారం రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు. బాలిక తండ్రి ఈ నెల 20న ఇచ్చిన ఫిర్యాదు మేరకు యువకుడిపై కేసు నమోదు చేశామని.. అచ్చంపేట కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి రిమాండ్ విధించిందని, కల్వకుర్తి జైలుకు తరలించినట్లు ఎస్ఐ వివరించారు.

విద్యార్థి బలవన్మరణం

మహబూబ్‌నగర్ క్రైం: బీటెక్ పూర్తి చేసి ఉద్యోగ అన్వేషణలో ఉన్న ఓ యువకుడు ఇంట్లో ఉరి వేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డాడు. చేసుకోవడం జరిగింది. మహబూబ్‌నగర్ లోని భగిరథ కాలనీకి చెందిన బద్రీనాథ్(23) శనివారం రాత్రి 8.30 ప్రాంతంలో ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతికి గల కారణాలు తెలియరాలేదు. ఈ ఘటనపై ఎలాంటి ఫిర్యాదు రాలేదని రూరల్ ఎస్ఐ వెంకటేశ్వర్లు వెల్లడించారు.

ఐబీసీసీ పేరిట దోపిడీ

- 200 మంది నుంచి రూ.1.60 కోట్లు వసూలు
- ఏపీలో గతేడాదే పట్టుబడిన వైనం
- తాజాగా గద్వాల జిల్లాలో కార్యకలాపాలు
- ఓ ప్రముఖ నాయకుడి ప్రవేశంతో గోల్‌మాల్


ఐబీసీసీ సంస్థలో శిక్షణ తీసుకుంటున్న యువతీ, యువకులు (ఫైల్)

గద్వాల క్రైం: జోగుళాంబ గద్వాల జిల్లాలో నిత్యం ఏదో ఒక మోసం వెలుగులోకి రావడం పరిపాటిగా మారింది. వరుసగా మోసపూరితమైన సంఘటనలు వెలుగులోకి వస్తున్నా పోలీసులు తమకేం సంబంధం లేదనే భావనలో ఉన్నారు. తాజాగా ఏపీకి చెందిన ఐబీసీసీ (ఇండిపెండెంట్ బిజినెస్ కన్సల్టర్ సెంటర్) పేరుతో జిల్లాకేంద్రంలోని శ్రీనివాసకాలనీలో ఓ మూడు అంతస్తుల భవంతిలో 200 మంది ఏపీకి చెందిన నిరుద్యోగ యువతీ, యువకుల నుంచి రూ.1.60 కోట్లు వసూలు చేసి బిజినెస్ దందా నిర్వహిస్తున్నారు. అయితే ఈ మోసపూరితమైన సంస్థ నిర్వాహకులను పోలీసులు అదుపులోకి తీసుకున్నా.. బాధితులు ఎవరూ ఫిర్యాదు చేయడం లేదనే నెపంతో వదిలేశామని పట్టణ ఎస్ఐ రామస్వామి చెప్పడం గమనార్హం.

అసలేం జరిగిందంటే..

ఐబీసీసీ సంస్థ పేరుతో ఏపీకి చెందిన కొందరు గద్వాల శ్రీనివాసకాలనీలోని మోమిన్ అనే వ్యక్తికి చెందిన మూడు అంతస్తుల భవనాన్ని రెండు నెలల కిందట అద్దెకు తీసుకున్నారు. అయితే ఏపీకి చెందిన 200 మంది నిరుద్యోగులను ఇండిపెండెంట్ బిజినెస్ పేరుతో ఒక్కొక్కరి నుంచి రూ.8,500 శిక్షణ తరగతుల కోసం వసూలు చేశారు. ఇక్కడే నాలుగు రోజుల పాటు వ్యాపార మెళకువలు నేర్పించి.. కంపెనీ ప్రొడక్ట్ పేరుతో యువతకు ఒక జత దుస్తులు, షూ, టై, బెల్ట్ డ్రెస్‌కోడ్‌గా అందిస్తారు. ఆ తర్వాత ఇండిపెండెంట్ వ్యాపారంలోకి తెలిసిన బంధువులు, స్నేహితులు ఈ సంస్థలో జాయిన్ చేయించడంతోపాటు గ్రాబిజ్ కంపెనీలో ప్రొడక్టు కొనుగోలు చేస్తే కమీషన్ రూపంలో నెలకు రూ.10- 20 వేల వరకు సంపాదించవచ్చని ఆశ కల్పిస్తారు. తక్కువ పెట్టుబడి కావడంతో చాలామంది నిరుద్యోగులు ఇందులో చేరారు. వీరి నుంచి ఇప్పటి వరకు రూ.1.60 కోట్లు వసూలు చేసినట్లు సమాచారం. ఈ దందాపై స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వెలుగులోకి వచ్చింది.

నాయకుల రంగప్రవేశంతో..

ఐబీసీసీ సంస్థకు చెందిన గణేష్ (వైఎస్ఆర్ జిల్లా పులివెందుల), రామకృష్ణ (నంద్యాల), రమేష్ (అనంతపురం జిల్లా గుత్తి)కి చెందిన నిర్వాహకులను శుక్రవారం పట్టణ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అయితే కేసు నుంచి బయటపడేందుకు భవన యజమానితో పెద్దఎత్తున బేరసారాలు చేసినట్లు సమాచారం. కేసు లేకుండా చూడాల్సిందిగా అధికార పార్టీకి చెందిన ఓ నాయకుడిని భవన యజమాని, సంస్థ నిర్వాహకులు కలిసి మొర పెట్టుకున్నట్లు తెలిసింది. దీంతో రంగప్రవేశం చేసిన ప్రముఖ నాయకుడు తన వ్యక్తిగత సహాయకుడితో పోలీసులతో ఒప్పందం కుదుర్చుకుని కేసును తప్పుదోవ పట్టించారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. బాధితులంతా ఏపీకి చెందినవారు కావడం, ఎవరూ ఫిర్యాదు చేయలేదనే సాకుతో పోలీసులు సైతం ఈ కేసు విషయంలో ముందుకెళ్లడం లేదని తెలుస్తుంది. అయితే ఈ ఐబీసీసీ సంస్థపై 2022లో అనంతపురం జిల్లా తాడిపత్రి నియోజకవర్గంలోని కమలానగర్‌లో పోలీసులు కేసు నమోదు చేసినట్లు తెలిసింది. అక్కడ దుకాణం మూసివేసి తాజాగా గద్వాలలో నిర్వహిస్తున్న దందా శుక్రవారం వెలుగులోకి వచ్చింది.


ఐబీసీసీ సంస్థ గైడ్‌లైన్స్‌లోని వివరాలు

గొలుసుకట్టు వ్యాపారం..

గద్వాల, అలంపూర్ నియోజకవర్గాల్లోని సామాన్య ప్రజలను లక్ష్యంగా చేసుకుని గొలుసు కట్టు వ్యాపారాలు నిర్వహిస్తున్నారు. ప్రభుత్వ అనుమతి లేకుండా చీటీలను నడిపిస్తూ బురిడీ కొట్టిస్తున్నారు. ఈ వరుసలో ఇన్సూరెన్స్, బైక్, కారు, ప్లాట్ తదితర స్కీంల పేరిట నడుస్తున్న వ్యాపారంలో ఇలాంటి మోసాలలో పెరల్స్, యం కేర్, అగ్రిగోల్డ్, అక్షయ గోల్డ్, ఈము పక్షులు తదితర వ్యాపారాల పేరిట పలు రాష్ట్రాల నిర్వాహకుల చేతిలో మోసానికి గురైన ప్రజలు ఈ జిల్లాకు చెందినవారే ఎక్కువ ఉన్నారు. అయితే అక్షయ గోల్డ్ సంస్థపై గద్వాల, అయిజ పోలీసుస్టేషన్లలో 2018లో కేసులు నమోదయ్యాయి. ఈ కేసులో సీబీడీ విచారణ సైతం కొనసాగినా.. ఇప్పటి వరకు ఎలాంటి పురోగతి లేదు.

విచారణ జరుపుతాం..



ప్రజలను మోసం చేసిన సంఘటనలపై విచారణ చేపట్టి తగు చర్యలు తీసుకుంటాం. ఐబీసీసీ సంస్థ వ్యవహారం గురించి సిబ్బందిని అడిగి తెలుసుకుంటాను. ప్రభుత్వ అనుమతి లేకుండా జిల్లాలో ఎవరైనా చిట్‌ఫండ్, గొలుసుకట్టు, వడ్డీ వ్యాపారాలు చేయడం నేరం. ఆర్థిక విషయాల అంశాలపై ప్రజలు ప్రభుత్వ రంగ సంస్థలైన బ్యాంకులు, ప్రభుత్వ అనుమతి పొందిన సంస్థలలో మాత్రమే డబ్బులు పొదుపు చేసుకోవాలి. కొందరు పోలీసులకు ఫిర్యాదు చేయడంలో అలసత్వం చూపుతున్నారు. తమకు జరిగిన అన్యాయంపై ధైర్యంగా పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయాలి.

– సృజన, ఎస్పీ, జోగుళాంబ గద్వాల

ఆ ఉపాధ్యాయుడు మాకొద్దు..


కొంకల పాఠశాల వద్ద గేటు మూసి ఆందోళనకు దిగిన విద్యార్థులు

- పాఠశాల గేటుకు తాళం వేసి విద్యార్థులు, తల్లిదండ్రుల ఆందోళన

శాంతినగర్: సదరు ఉపాధ్యాయుడి రాకతో పాఠశాలలో అన్ని సమస్యలే వుంటాయని, మాకొద్దంటూ విద్యార్థులు, తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేసిన సంఘటన వడ్డేపల్లి మండలంలోని కొంకల ప్రాథమిక పాఠశాలలో శనివారం చోటుచేసుకుంది. గతంలో కొంకల ప్రాథమిక పాఠశాలలో పనిచేసి డిప్యూటేషన్‌పై రాజోళి న్యూప్లాట్స్ పాఠశాలకు వెళ్లాడు ఉపాధ్యాయుడు భీసన్న. రెండేళ్లు అక్కడే పనిచేసి శనివారం కొంకల పాఠశాలకు తిరిగి రావడంతో విద్యార్థులు భయాందోళనకు గురై ఏకంగా తరగతులు బహిష్కరించారు. పాఠశాల గేటు వేసి భీసన్నసార్ మాకొద్దంటూ నినాదాలు చేశారు. వారి తల్లిదండ్రులు సైతం గ్రామ పంచాయతీ కార్యాలయానికి వెళ్లి సదరు ఉపాధ్యాయుడు మాకొద్దంటూ తీర్మాణం, కొంకల పాఠశాలకు పంపొద్దంటూ వినతిపత్రం సమర్పించారు.

ఎంఈఓ ఏమన్నారంటే..

ఈవిషయమై ఎంఈఓ నరసింహులును వివరణ కోరగా.. కొంకల ప్రజలు భీసన్న ఉపాధ్యాయుడిని వద్దని వినతిపత్రం ఇచ్చారన్నారు. గతంలో రాజోళి న్యూ ప్లాట్స్‌పాఠశాలకు డిప్యూటేషన్‌పై పంపామని, అక్కడ కూడా ఆయనను వద్దంటున్నారన్నారు. దీంతో సెలవులో వుండమని, జిల్లా అధికారులతో మాట్లాడి చెబుతామని చెప్పగా శనివారం కొంకల పాఠశాలకు వెళ్లడంతో సమస్య తలెత్తిందని వివరించారు. డీఈఓకి సమాచారం పంపానన్నారు. సోమవారం జిల్లా కార్యాలయానికి వెళ్లి జిల్లా అధికారితో మాట్లాడతానని ఎంఈఓ పేర్కొన్నారు.

గతంలో ఏం జరిగిందంటే..

ఇదిలాఉండగా, సదరు ఉపాధ్యాయుడు ఇక్కడ పనిచేసిన సమయంలో ఇతర ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులతో తరచూ గొడవపడేవాడని, ఆ ఉపాధ్యాయుడు వుంటే పిల్లలను పాఠశాలకు పంపమని చెబుతూ ఇళ్లవద్దనే పెట్టుకునే పరిస్థితి ఉండింది. దీంతో తనంతట తానే కొంకల పాఠశాలలో పనిచేయలేనని, వేరే పాఠశాలకు పంపాలని ఎంఈఓకు దరఖాస్తు చేసుకుని వెళ్లిపోయాడు. రెండేళ్ల తరువాత తిరిగి పాఠశాలకు రావడంతో విద్యార్థులు గేటు మూసి నిరసనతోపాటు ఆందోళన చేపట్టారు.

తాళం వేసిన ఇంటికి కన్నం

మహబూబ్‌నగర్ క్రైం: తాళం వేసిన ఇంటికి గుర్తు తెలియని వ్యక్తులు కన్నం వేశారు. రూరల్ ఎస్ఐ వెంకటేశ్వర్లు కథనం ప్రకారం.. జిల్లాకేంద్రంలోని విఘ్నేశ్వర కాలనీకి చెందిన ఎండీ మన్సూర్ శుక్రవారం రాత్రి ఇంటికి తాళం వేసి కుటుంబంతో కలిసి పట్టణంలోని మదీనా మసీద్ ఏరియాలో ఉన్న బంధువుల ఇంటికి వెళ్లాడు. శనివారం ఉదయం వచ్చి చూడగా ఇంటి తలుపులకు వేసిన తాళం పగిలిపోయి ఉండటంతో పాటు బీరువాలో ఉన్న రూ.5 వేల నగదుతో పాటు రెండు విదేశీ నోట్లను ఎత్తుకెళ్లారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

బైక్ తగలపెట్టిన గుర్తు తెలియని వ్యక్తులు

మహబూబ్‌నగర్ క్రైం: ఇంటి పక్కన ఉన్న చెట్టుకింద పెట్టిన ద్విచక్ర వాహనాన్ని గుర్తు తెలియని వ్యక్తులు తగలపెట్టారు. మహబూబ్‌నగర్ రూరల్ ఎస్ఐ వెంకటేశ్వర్లు కథనం ప్రకారం..మండల పరిధిలోని అప్పాయిపల్లికి చెందిన గొల్ల ఊషన్న తన టీఎస్06ఎఫ్‌డి 2379 నంబర్ కలిగిన ద్విచక్ర వాహనాన్ని శుక్రవారం రాత్రి ఇంటి పక్కన ఉన్న చెట్టు కింద పెట్టాడు. శనివారం తెల్లవారుజామున గుర్తు తెలియని వ్యక్తులు బైక్‌ను తగలపెట్టారు. గ్రామానికి చెందిన నలుగురు వ్యక్తులపై అనుమానం ఉందని బాధితుడు గొల్ల ఊషన్న ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

కంటైనర్‌ను ఢీకొన్న కారు

ఒకరి మృతి, మరో ముగ్గురికి గాయాలు


ప్రమాదంలో ధ్వంసమైన కారు

సదాశివనగర్: కామారెడ్డి జిల్లా సదాశివనర్ మండలంలోని దగ్గి అటవీ ప్రాంతం శివారులో 44వ జాతీయ రహదారిపై శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా మరో ముగ్గురికి గాయాలయ్యాయి. ఘటనా వివరాలు.. మహబూబ్‌నగర్ జిల్లా తిరుమలాపూర్‌కు చెందిన పసుపులేటి వెంకటలక్ష్మిదేవి (39), పసుపులేటి లక్ష్మీనారాయణ, చక్రాల బాలాజీ, డ్రైవర్ శ్రీనివాస్ వ్యాపార నిమిత్తం ఈ నెల 22న ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని రాయ్‌పూర్ పట్టణానికి వెళ్లారు. శుక్రవారం అక్కడి నుంచి తిరుగు పయనమయ్యారు. శనివారం వారు దగ్గి అటవీ ప్రాంతం శివారుకు రాగానే కారు డ్రైవర్ శ్రీనివాసులు అతివేగంతో, అజాగ్రత్తగా నడుపుతూ ముందు వెళ్తున్న కంటైనర్ ట్రక్కును వేగంగా ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో కారులో ఉన్న ముగ్గురికి స్వల్పగాయాలు కాగా, వెంకటలక్ష్మి దేవికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను హైవే అంబులెన్స్‌లో నిజామాబాద్‌లోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ వెంకటలక్ష్మిదేవి మృతి చెందినట్లు ఎస్సై రాజేశ్ తెలిపారు. ప్రమాదానికి కారణమైన కారు డ్రైవర్‌పై చర్యలు తీసుకోవాలని మృతురాలి బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు.

మైనర్ల ప్రేమ వివాహం

- పెళ్లి పెద్దలపై కేసు నమోదుకు యత్నం
- ప్రేమ జంటను స్టేట్ హోంకు తరలించిన పోలీసులు

మిడ్జిల్: మండల పరిధిలోని ఓ గ్రామానికి ఇతర జిల్లా నుంచి మైనర్ అమ్మాయి, తన అమ్మమ్మ ఇంటికి వచ్చింది. అదే గ్రామానికి చెందిన అబ్బాయితో ఏడాది నుంచి పరిచయం ఏర్పడి ప్రేమ వరకు వెళ్లింది. మే నెలలో అమ్మాయి, అబ్బాయి ఇంటి నుంచి వెళ్లిపోయారు. అమ్మాయి తప్పిపోయినట్లు అదే నెలలో కల్వకుర్తి పోలీస్‌స్టేషన్‌లో అమ్మాయి బంధువులు ఫిర్యాదు చేయగా.. మిస్సింగ్ కేసు నమోదు చేశారు. ఆ తర్వాత అమ్మాయిని పోలీసులు వారి బంధువులకు అప్పగించి, గ్రామ పెద్దల సమక్షంలో రాజీ కుదుర్చారు. వారికి ఇంకా ఆరు నెలల వయస్సు తక్కువగా ఉండటంతో అప్పటి వరకు ఎవరి ఇళ్లలో వారు ఉండాలని తీర్మానించారు. ఆ తర్వాత ఈ నెల 12న మండల కేంద్రంలోని ఆలయంలో కొంత మంది పెద్దల సమక్షంలో వారికి పెళ్లి జరిపించారు. ఇద్దరి కులాలు వేరు కావడంతో అబ్బాయి తల్లి బలవంతంగా తన కుమారుడికి పెళ్లి జరిపించారని రెండు రోజుల కిందట మిడ్జిల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఎస్ఐ రామ్‌లాల్ నాయక్ విచారణ జరిపి కేసు నమోదు చేశారు. మైనర్ అబ్బాయి, అమ్మాయిని జిల్లా కేంద్రంలోని బాలల సంరక్షణ కేంద్రానికి శనివారం తరలించారు. మైనర్లకు పెళ్లి చేసిన కొంత మందిపై విచారణ జరిపి కేసు నమోదు చేస్తామని ఎస్ఐ వివరించారు.

అవినీతిలో కూరుకుపోయిన బీఆర్ఎస్ ప్రభుత్వం

పాలమూరు: రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వం పూర్తిగా అవినీతిలో కూరుకుపోయిందని, ధరణి పోర్టల్ పేరుతో అక్రమాలకు తెరలేపారని బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ కార్యదర్శి నిఖిల్ ఆనంద్ ఆరోపించారు. జిల్లా బీజేపీ కార్యాలయంలో శనివారం ఆయన మాట్లాడుతూ కేంద్రం అమల్లోకి తెచ్చిన ఆయూష్మాన్ భారత్ పథకాన్ని తెలంగాణలో అమల్లోకి రాకుండా అడ్డుకున్నారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వానికి బీసీలపై ఏమాత్రం చిత్తశుద్ధి లేదన్నారు. కేంద్రం ప్రభుత్వం అవినీతిని సహించదని, అది కేసీఆర్ కుటుంబం అయిన ఇతరులు ఎవరైనా జైలు శిక్ష తప్పదన్నారు. తెలంగాణకి కేంద్రం అన్ని విధాలుగా నిధులు ఇస్తోందని, కానీ బీఆర్ఎస్ నాయకులు ఎలాంటి నిధులు ఇవ్వలేదని నిందలు మోపడం సరికాదన్నారు. రాబోయో ఎన్నికల్లో కేంద్రంతో పాటు రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వం రాబోతుందన్నారు.కార్యక్రమంలో బీజేపీ నేతలు ఎన్పీ వెంకటేష్, పద్మజా రెడ్డి, పి.చంద్రశేఖర్, అంజయ్య, పాండురంగారెడ్డి పాల్గొన్నారు.

ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య

మహబూబ్‌నగర్ క్రైం: తాగుడుకు బానిసై..భార్యపై అనుమానంతో ఓ భర్త ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. వన్‌టౌన్ ఎస్ఐ జగన్నాథం కథనం ప్రకారం.. మహబూబ్‌నగర్‌లోని పాత పాలమూరుకు చెందిన సుర్‌జిత్ కుమార్(38) శనివారం తెల్లవారుజామున 3.45ప్రాంతంలో ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడు కొన్ని రోజులుగా తాగుడుకు బానిసై భార్యపై అనుమానంతో గొడవపడుతూ ఉండేవాడు. ఈ క్రమంలో శుక్రవారం రాత్రి కూడా మద్యం తాగిన మైకంలో భార్యతో మరోసారి గొడవ పడి.. నీకు ఎవరితో అక్రమ సంబంధం ఉందని అంటూ తాను ఉరి వేసుకుంటానని బెదిరించి గదిలోకి వెళ్లి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య శాంతమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు.

డివైడర్ ఎక్కి.. ఆపై లారీని ఢీకొట్టి

- అదుపుతప్పిన బొలేరో
- ముగ్గురు యువకుల దుర్మరణం
- హైదరాబాద్‌లో గొర్రెలు అమ్మి వస్తుండగా ప్రమాదం
- షాద్‌నగర్ శివారులో ఘటన


ప్రమాదంలో దెబ్బతిన్న బొలేరో వాహనం


అశోక్ (ఫైల్)


శంకర్‌నాయక్ (ఫైల్)


రవినాయక్ (ఫైల్)

షాద్‌నగర్/కోడేరు/పాన్‌గల్: రోడ్డు ప్రమాదంలో ముగ్గురు యువకులు దుర్మరణం చెందారు. హైదరాబాద్‌లో గొర్రెలు విక్రయించి తిరిగి వస్తుండగా.. వారు ప్రయాణిస్తున్న వాహనం అదుపు తప్పి డివైడర్, ఆ తర్వాత లారీని ఢీకొట్టడంతో ఈ ప్రమాదం జరిగింది. ఈ సంఘటన శనివారం ఉదయం రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ శివారులోని అన్నారం వై జంక్షన్ వద్ద చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. వనపర్తి జిల్లా పాన్‌గల్ మండలం మందాపూర్‌కు చెందిన అశోక్ (28) బొలేరో వాహనం డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. నాగర్‌కర్నూల్ జిల్లా కోడేరు మండలం నార్యానాయక్ తండాకు చెందిన రవినాయక్ (25), వనపర్తి జిల్లా పాన్‌గల్ మండలం తెల్లరాళ్లపల్లి తండాకు చెందిన శంకర్‌నాయక్ (30) మేస్త్రి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. అదనపు ఆదాయం కోసం వారు గొర్రెల వ్యాపారం కూడా చేస్తున్నారు. ఈ నేపథ్యంలో శుక్రవారం సాయంత్రం బొలేరో వాహనంలో గొర్రెలను తీసుకొని హైదరాబాద్ వెళ్లారు. తిరిగి శనివారం ఉదయం వనపర్తి జిల్లా పెబ్బేరు సంతలో గొర్రెలను కొనుగోలు చేసేందుకు అదే వాహనంలో హైదరాబాద్ నుంచి బయలుదేరారు. మార్గమధ్యలో షాద్‌నగర్ శివారులోని అన్నారం వై జంక్షన్ వద్దకు రాగానే వాహనం అదుపు తప్పి.. డివైడర్ ఎక్కి పక్క వరుసలో జడ్చర్ల నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న లారీని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బొలేరోలో ఉన్న పై ముగ్గురు అక్కడికక్కడే మృతి చెందారు. వాహనంలో ఇరుక్కుపోయిన మృతదేహాలను.. సీఐ నవీన్‌కుమార్, ఎస్ఐ విజయ్‌కుమార్ బయటికి తీసి షాద్‌నగర్ కమ్యూనిటీ ఆస్పత్రికి తరలించారు. డ్రైవర్ నిద్రమత్తులో ఉండటంతోనే ప్రమాదం జరిగిందని భావిస్తున్నారు. ప్రమాదం జరిగిన తీరుకు సంబంధించిన సీసీ పుటేజీ సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొడుతోంది.


నార్యానాయక్‌తండాలో రవినాయక్ ఇంటి ఎదుట..

కొడుకు పుట్టాలని..

ప్రమాదంలో మృతి చెందిన రవి నాయక్‌కు ఆరేళ్ల క్రితం సుమలతతో వివాహం జరిగింది. వారికి ఇద్దరు ఆడపిల్లలు పుట్టారు. మూడో సంతానంలో మగ పిల్లవాడు కలగాలని కోరుతూ రవినాయక్ కొన్ని రోజుల క్రితం స్వగ్రామమైన నార్యానాయక్ తండా నుంచి శ్రీశైలానికి పాదయాత్ర చేశాడు. ప్రస్తుతం భార్య సుమలత గర్భిణి. కోరిన కోరిక తీరుతుందో లేదో తెలియకుండానే రవి నాయక్ రోడ్డు ప్రమాదంలో కన్నుమూశాడు. ప్రమాదంలో మృతి చెందిన శంకర్ నాయక్‌కు ఇద్దరు కొడుకులు, కూతురు ఉన్నాడు. ఇంటి పెద్ద మృతితో వారి కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి.

ఆయనే ఇంటికి పెద్ద దిక్కు

వనపర్తి జిల్లా మందాపూర్(మహ్మదాపూర్)కు చెందిన కుర్మయ్య, కనకమ్మలకు నలుగురు సంతానం. అందులో పెద్ద కొడుకు అశోక్ డ్రైవర్‌గా పని చేస్తూ కుటుంబానికి ఆసరాగా ఉన్నాడు. ఇంటికి పెద్ద దిక్కు కోల్పోవడంతో కుటుంబ సభ్యుల వేదనకు అంతులేకుండా పోయింది.

నిజాయితీ చాటిన అంబులెన్స్ సిబ్బంది

రోడ్డు ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు 108 అంబులెన్స్‌కు సమాచారం అందజేశారు. ప్రమాదం జరిగిన ప్రాంతం నుంచి అంబులెన్స్ సిబ్బంది మృతదేహాలను షాద్‌నగర్ కమ్యూనిటీ ఆస్పత్రికి 108 వాహనంలో తరలించారు. మృతదేహాలను బొలేరో వాహనం నుంచి బయటికి తీస్తున్న క్రమంలో వాహనంలో రూ.1.92 లక్షలతో పాటు సెల్‌ఫోన్‌ను గుర్తించారు. వాటిని స్థానిక పోలీసులకు అందజేశారు. అంబులెన్స్ సిబ్బంది నిజాయతీని పలువురు అభినందించారు.

మిన్నంటిన రోదనలు

రోడ్డు ప్రమాదంలో ముగ్గురు మృత్యువాత పడ్డారనే విషయం తెలుసుకున్న వారి కుటుంబ సభ్యులు షాద్‌నగర్‌లోని ప్రభుత్వ కమ్యూనిటీ ఆస్పత్రికి చేరుకున్నారు. కుటుంబ సభ్యులు, బంధువుల రోదనలు మిన్నంటాయి. కన్హాశాంతి వనంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి విచ్చేసిన మంత్రి నిరంజన్‌రెడ్డి ప్రమాద ఘటనపై సంతాపం వ్యక్తం చేశారు.

కంటి నిండా నిద్ర కరువు



40 ఏళ్లు పైబడిన వారిని వేధిస్తున్న నిద్ర లేమి

- ఏజ్ వెల్ ఫౌండేషన్ అధ్యయనంలో వెల్లడి
- 5 వేల మందిపై సర్వే
- కనీసం 6 గంటలు నిద్ర పోలేకపోతున్నట్టు 70 శాతం మంది వెల్లడి
- నిద్ర లేమితో బాధపడుతున్న వారిలో పురుషులే అధికం

సాక్షి, అమరావతి: మారిన జీవన విధానాలు, చుట్టుముడుతున్న ఆర్థిక, కుటుంబ సమస్యల నడుమ మధ్య వయస్కులు, వృద్ధుల్లో కంటి నిండా నిద్ర కరవు అవుతోంది. ముఖ్యంగా మధ్య వయస్కులు పగలంతా కష్టం చేసి రాత్రి అయ్యాక కంటి నిండా నిద్రపోవడం ఒక కలగా మారుతోంది. ఏజ్‌వెల్ ఫౌండేషన్ అధ్యయనంలో ఈ విషయం వెల్లడైంది. 40 నుంచి 64 ఏళ్లు, 65 ఏళ్లు పైబడిన వృద్ధులు ఇలా రెండు వర్గాలుగా మే నెలలో దేశవ్యాప్తంగా 5 వేల మంది నుంచి ఫౌండేషన్ వివరాలు సేకరించింది. వీరిలో 40 నుంచి 64 ఏళ్ల వారు 2245 (పురుషులు 1102, మహిళలు 143)మంది, 65 ఏళ్లు పైబడిన వారు 2,755 (పురుషులు 1,336, మహిళలు 1,419) మంది ఉన్నారు.

6 గంటలు కూడా నిద్రపోలేకున్నాం

70 శాతం మంది రోజులో కనీసం ఆరు గంటలు కూడా కంటి నిండా నిద్ర పోలేకపోతున్నట్లు ఈ సర్వేలో వెల్లడైంది. 24 శాతం మంది మాత్రం 7 నుంచి 8 గంటలు, 6 శాతం మంది 8 గంటలకు పైగా నిద్రపోతున్నట్టు తెలిపారు. మధ్య వయసుకుల్లో 60 శాతం ఆరు గంటలలోపు, 31 శాతం 7 నుంచి 8 గంటలు, 9 శాతం మంది 8 గంటలకు పైగా నిద్రపోతున్నామన్నారు. అదే వృద్ధుల్లో 78 శాతం మంది ఆరు గంటల్లోపు, 19 శాతం మంది 7 నుంచి 8 గంటలు, 3 శాతం మంది 8 గంటలకు పైగా నిద్ర పోతున్నట్టు వెల్లడైంది.

ఆర్థిక ఇబ్బందులు ప్రధాన కారణం

నిద్ర లేమికి ప్రధాన కారణం ఆర్థిక పరమైన అంశాలేనని సర్వేలో వెల్లడైంది. ఆ తర్వాత కుటుంబ సభ్యుల మధ్య సయోధ్య లేకపోవడం, ఇతర కలహాలు కారణమని పేర్కొంది. యాంత్రిక జీవనం, మానసిక, శారీరక ఆరోగ్య సమస్యలు, మద్యం సేవించడం, ఇతర సమస్యలతో సరైన నిద్ర ఉండటంలేదని కూడా ఫౌండేషన్ తెలిపింది. వయోభారం రీత్యా చుట్టుముట్టిన ఆరోగ్య సమస్యలు, ఒంటరి జీవనం నిద్రలేమికి కారణంగా వృద్ధులు పేర్కొన్నారు.

ఇలా చేయండి.. నిద్ర పడుతుంది

సర్వేలో భాగంగా నిద్ర లేమి సమస్య నివారణకు పలు సలహాలు, సూచనలు కూడా ఫౌండేషన్ తెలియజేసింది. అవి..

- నిద్రకు ఉపక్రమించే 4 గంటల ముందు నుంచి కాఫీ, టీలు తాగకూడదు. ధూమపానం, మద్య పానం చేయకూడదు. వేడి పాలను తాగాలి
- ఆందోళన, ఒత్తిడి, నిరాశ నిద్రకు పెద్ద అవరోధం. వాటిని అధిగమించడానికి చర్యలు తీసుకోవాలి
- పగటిపూట నిద్ర మానుకోవాలి
- టీవీ, సెల్ ఫోన్ చూడకూడదు
- పడక గదిలో స్లీప్ ఫ్రెండ్లీ వాతావరణం ఉండేలా చూసుకోవాలి

పురుషులే అధికం

నిద్రలేమితో సతమతం అవుతున్న వారిలో పురుషులే అధికం. పురుషుల్లో 81 శాతం మంది కనీసం ఆరు గంటలు కూడా నిద్రపోలేకపోతున్నామని వెల్లడించారు. అదే మహిళల విషయానికి వస్తే 60 శాతం మంది ఆరు గంటలలోపు నిద్రపోతున్నామని చెప్పారు. మరో 15% మంది పురుషులు, 32% మంది మహిళలు 7 నుంచి 8 గంటలు, 4% పురుషులు, 8 శాతం మహిళలు 8 గంటలకు పైగా నిద్రపోతున్నట్టు తెలిపారు. సర్వేలో పాల్గొన్న మొత్తం వ్యక్తుల్లో 55.08% మంది ప్రస్తుతం నిద్ర విధానంతో అసంతృప్తిగా ఉన్నామని తెలిపారు.



చిక్కిన చిరుత

- తల్లి చిరుతను పట్టుకునేందుకు బోను ఏర్పాటు
- నడక మార్గంలో యథావిధిగా భక్తులకు అనుమతి
- అలిపిరి–తిరుమల మధ్య ఫెన్సింగ్ ఏర్పాటు వీలుకాదు
- టీటీడీ ఈవో ధర్మారెడ్డి



తిరుమల నడక దారిలో పట్టుబడిన చిరుత

తిరుమల: అలిపిరి–తిరుమల మార్గంలో బాలుడిపై దాడికి పాల్పడిన చిరుత అటవీ శాఖ ఏర్పాటు చేసిన బోనులో చిక్కింది. శేషాచలం అటవీ ప్రాంతంలోని 7వ మైలు వద్ద రెండు ప్రదేశాల్లో రెండు బోన్లు పెట్టగా.. ఒక దానిలో శుక్రవారం రాత్రి 10.45 గంటలకు చిరుత చిక్కిందని టీటీడీ ఈవో ఏవీ ధర్మారెడ్డి తెలిపారు. శనివారం ఉదయం ఆ చిరుతను టీటీడీ ఈవో అటవీ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గురువారం రాత్రి అలిపిరి నడక మార్గంలో బాలుడిపై చిరుత దాడి చేసిందని తెలియగానే దానిని పట్టుకోవాలని నిర్ణయించామన్నారు. చిరుత వయసు ఏడాదిన్నర ఉంటుందని, అది పిల్లిని తరుముకుంటూ వచ్చి అవగాహన లేక పిల్లాడిని తీసుకెళ్లినట్టుగా గుర్తించామని అన్నారు.

చిరుతలు మనుషులపై దాడి చేయవు

చిన్న చిరుత కావడం వల్ల వేటపై అవగాహన లేక ఈ ఘటన చోటుచేసుకున్నట్టు అటవీ అధికారులు తెలిపారు. చిరుతలు మనుషులపై దాడి చేయవన్నారు. చిరుతను బంధించేందుకు రెండు ప్రాంతాల్లో బోన్లను ఏర్పాటు చేసి 150 ప్రాంతాల్లో సీసీ కెమెరాలను అమర్చామని తెలిపారు. శుక్రవారం రాత్రి 10.45 గంటలకు బోనులో చిరుత పడినట్టు సమాచారం వచ్చిందన్నారు. పట్టుబడిన చిరుతను 50 కిలోమీటర్ల అవతల అటవీ ప్రాంతంలో వదిలేందుకు చర్యలు తీసుకుంటున్నామని అటవీ శాఖ అధికారులు తెలిపారు. తల్లి చిరుత కూడా ఈ ప్రాంతంలో సంచరిస్తున్నట్టు గుర్తించామని, దానిని కూడా పట్టుకుంటామని చెప్పారు. శుక్రవారమే తల్లి చిరుత పట్టుబడేదని.. అయితే తగినంత ఆహారం దొరకడంతో అది రాలేదని గుర్తించామన్నారు. త్వరలోనే దాన్ని పట్టుకుని దూరంగా విడిచి పెట్టి భక్తుల్లో ఉన్న భయాందోళనలు తొలగిస్తామన్నారు.

నడక మార్గంలో వచ్చే భక్తులను ఆపబోం

చిరుత దాడి నేపథ్యంలో అలిపిరి–తిరుమల నడక మార్గాన్ని మూసివేస్తున్నట్టు వస్తున్న ఆరోపణలు అవాస్తవమని టీటీడీ ఈవో ధర్మారెడ్డి స్పష్టం చేశారు. శ్రీవారిని దర్శించుకునేందుకు వచ్చే భక్తులను ఎట్టి పరిస్థితుల్లో ఆపేది లేదన్నారు. రాత్రి 7 నుంచి 10 గంటల వరకు గాలి గోపురం నుంచి నరసింహస్వామి ఆలయం వరకు 200 మంది భక్తులకు ఒక సెక్యూరిటీ గార్డు చొప్పున కేటాయింపు ఒక గుంపుగా పంపుతున్నామని తెలిపారు. నడక మార్గంలో ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని కొందరు కోరుతున్నారన్నారు. జంతువులు తిరిగే అటవీ ప్రాంతంలో వాటి స్వేచ్ఛకు ఇబ్బంది కలిగించకూడదని, అటవీ శాఖ నిబంధనల మేరకే వ్యవహరించాలని స్పష్టం చేశారు.

తిరుమలలో ఆగస్టు, సెప్టెంబర్ గదుల కోటా 26న విడుదల

తిరుమల: శ్రీవారి భక్తుల సౌకర్యార్థం టీటీడీ షెడ్యూల్ ప్రకారం తిరుమల శ్రీవారి ఆర్జిత సేవలు, దర్శన టికెట్లు, గదుల కోటాను విడు దల చేస్తోంది. ఇందులో భాగంగా ఆగస్టు, సెప్టెంబర్ నెలలకు సంబంధించిన గదుల కోటాను ఈ నెల 26న ఉదయం 10 గంటలకు ఆన్‌లైన్‌లో విడుదల చేయనుంది. తిరుమల, తిరుపతి, తలకోన ప్రాంతాల్లోని గదులను భక్తులు https://tirupatibalaji.ap.gov.in వెబ్‌సైట్‌లో బుక్ చేసుకోవచ్చు.

29న శ్రీశైలంలో సహస్ర ఘటాభిషేకం

శ్రీశైలం టెంపుల్: రాష్ట్రం సస్యశ్యామలం కావాలనే సంకల్పంతో ఈ నెల 29న శ్రీశైల మహాక్షేత్రంలో మల్లికార్జున స్వామికి సహస్ర ఘటాభిషేకం నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి లవన్న శనివారం తెలిపారు. తొలి ఏకాదశి రోజున మల్లికార్జున స్వామికి సహస్ర ఘటాభిషేకం చేస్తామన్నారు. ఈ నెల 27 నుంచి 29 వరకు రుద్రపారాయణ, విరాటపర్వ పారాయణ, వారుణానువాక పారాయణ, కాళక పారాయణ, పంచాక్షరీజపం, రుష్యశృంగ, వరుణ జపాలు చేపడతామన్నారు.

ప్రీమియం రైళ్ల స్థానంలో 'వందేభారత్'

- శతాబ్ది స్థానంలో ప్రస్తుత చైర్‌కార్ రైళ్ల వినియోగం
- వచ్చే మార్చి నుంచి రానున్న వందేభారత్ స్లీపర్
- రాజధాని స్థానంలో వాటిని నడిపే యోచన



సాక్షి, హైదరాబాద్: భారతీయ రైల్వేలో ప్రీమియం కేటగిరీ రైళ్లుగా గుర్తింపు పొంది, దశాబ్దాలుగా విజయవంతంగా నడుస్తున్న శతాబ్ది, రాజధాని రైళ్లు త్వరలో కనుమరుగు కాబోతున్నాయి. కొత్తగా ప్రారంభమై సూపర్ సక్సెస్ అయిన వందేభారత్ రైళ్లను వాటి స్థానంలో నడపాలని రైల్వే శాఖ భావిస్తోంది. ప్రస్తుతం పగటి వేళ నడుస్తున్న చైర్‌కార్ కోచ్‌లతో కూడిన రెగ్యులర్ వందేభారత్ రైళ్లు శతాబ్ది స్థానాన్ని ఆక్రమించనున్నాయి. వచ్చే ఏడాది మార్చిలో అందుబాటులోకి రానున్న వందేభారత్ స్లీపర్ రైళ్లను రాజధాని స్థానంలో నడపాలని ప్లాన్ చేస్తోంది. దీంతో ప్రస్తుతం నడుస్తున్న శతాబ్ది, రాజధాని రైళ్లు దశలవారీగా మాయం కానున్నాయి.

అదే వేగంతో..

దేశవ్యాప్తంగా ప్రధాన నగరాల మధ్య వందేభారత్ రైళ్లను ప్రారంభిస్తున్నారు. వీలైనంత తొందరలో 400 వందేభారత్ రైళ్లను నడపాలని లక్ష్యంగా పెట్టుకున్న రైల్వే శాఖ వాటి తయారీపై దృష్టి సారించింది. చైర్‌కార్ కోచ్‌లతో ఉన్నందున వీటిని రాత్రి వేళ నడిపే వీలు లేదు. దీంతో ఉదయం నుంచి అర్ధ రాత్రి లోపు గమ్యం చేరి, మళ్లీ సొంత స్టేషన్‌కు తిరిగి వచ్చేలా సమయాలను సెట్ చేశారు. ప్రస్తుతం శతాబ్ది రైళ్లు కూడా ఇదే తరహాలో చైర్‌కార్ కోచ్‌లతో పగటి వేళ నడుస్తున్నాయి. భారత తొలి ప్రధాని నెహ్రూ శతజయంతికి గుర్తుగా శతాబ్ది (వందేళ్లు) పేరుతో 1988లో నాటి కాంగ్రెస్ ప్రభుత్వం వీటిని ప్రారంభించింది.

వచ్చే మార్చికి స్లీపర్ రైళ్లు..

తక్కువ దూరం ఉన్న ప్రధాన నగరాల మధ్య తిరుగుతున్న వందేభారత్ రైళ్లను దూర ప్రాంతాల మధ్యా ప్రవేశపెట్టాలని రైల్వే నిర్ణయించింది. ఇందుకోసం వందేభారత్ స్లీపర్ కోచ్ రైళ్లను ప్రవేశపెట్టాలని నిర్ణయించింది. ప్రస్తుతం చెన్నైలోని ఇంటిగ్రేటెడ్ కోచ్ ఫ్యాక్టరీలో దీనికి సంబంధించిన డిజైన్లు సిద్ధమవుతున్నాయి. వచ్చే మార్చి నాటికి తొలి రైలు పట్టాలెక్కించనున్నట్టు రైల్వే శాఖ ప్రకటించింది. ప్రస్తుతం రాజధాని నగరం ఢిల్లీకి, దేశంలోని ప్రధాన నగరాలకు మధ్య అనుసంధానంగా ఉన్న రాజధాని ఎక్స్‌ప్రెస్ రైళ్ల స్థానంలో వీటిని నడపాలని భావిస్తోంది. 1969లో ఢిల్లీ–హౌరా మధ్య తొలి రాజధాని ఎక్స్‌ప్రెస్ ప్రారంభమైంది. ప్రస్తుతం 18 రాజధాని రైళ్లు తిరుగుతున్నాయి. రాజధానిని తేజస్ రైళ్లుగా మార్చాలని నిర్ణయించి, తేజస్ రాజధాని పేరుతో ఏడు రైళ్లను రైల్వే శాఖ ఇప్పటికే ప్రారంభించింది. తాజాగా వాటి స్థానంలో వందేభారత్ స్లీపర్ కోచ్‌లను నడపాలని భావిస్తోంది.

అత్తను నరికిన అల్లుడు

- అక్కడికక్కడే మృతి చెందిన అత్త
- విజయవాడలో ఘాతుకం



నాగమణి (ఫైల్)

చిట్టినగర్ (విజయవాడ పశ్చిమ): అత్తను ఆమె అల్లుడే కత్తితో దారుణంగా నరికి చంపాడు. ఈ ఘటన విజయవాడ కొత్తపేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని నైనవరం ఫ్లై ఓవర్‌పై శనివారం రాత్రి చోటుచేసుకుంది. మామను కూడా చంపేందుకు ప్రయత్నించగా.. వేగంగా బైక్ నడిపి తప్పించుకోగలిగాడు. ఎన్టీఆర్ జిల్లా విజయవాడ వైఎస్సార్ కాలనీకి చెందిన గోగుల నాగమణి (50), గురుస్వామి భార్యాభర్తలు. వీరికి ముగ్గురు సంతానం కాగా, రెండో కుమార్తె లలితను ఏకలవ్యనగర్‌కు చెందిన కుంభా రాజేశ్‌కు ఇచ్చి వివాహం చేశారు. కొంతకాలంగా రాజేశ్, లలిత మధ్య గొడవలు జరగడంతో పోలీస్ స్టేషన్‌లో కేసు కూడా పెట్టారు. అప్పటి నుంచి లలిత పుట్టింట్లోనే ఉంటోంది. విడాకుల కోసం కోర్టులో దరఖాస్తు చేయగా కేసు చివరి దశలో ఉంది. ఈ క్రమంలో రాజేశ్ తన అత్త, మామలను చంపేందుకు ప్లాన్ చేశాడు. శనివారం రాత్రి 8.30 గంటల సమయంలో వైఎస్సార్ కాలనీ నుంచి సాయిరాం థియేటర్ వద్ద ఉంటున్న పెద్ద కుమార్తె ఇంటికి నాగమణి, గురుస్వామి బైక్‌పై బయలుదేరారు. వారి బైక్‌ను ఇంటి నుంచే రాజేశ్ మరో వ్యక్తితో కలిసి మరో బైక్‌పై వెంబడించాడు. నైనవరం ఫ్లై ఓవర్ మధ్యన ఉన్న పోలీస్ అవుట్ పోస్ట్ వద్దకు వచ్చేసరికి బైక్ వెనుక కూర్చున్న రాజేశ్ అత్త నాగమణిపై కత్తితో వేటు వేశాడు. భుజంపై కత్తి వేటుపడగా.. నాగమణి పెద్దగా కేకలు వేస్తూ కిందపడిపోయింది. దీంతో ఆమె మెడపై కత్తితో నరికాడు. అదే సమయంలో బైక్‌పై ఉన్న గురుస్వామి భయంతో వేగంగా అక్కడి నుంచి వెళ్లి తప్పించుకున్నాడు. కాగా, రక్తం మడుగులో పడి ఉన్న నాగమణి కొద్దిసేపు గాయాలతో విలవిల్లాడి ఘటనాస్థలంలోనే మృతిచెందింది.

13న జిల్లాస్థాయి స్పోర్ట్స్ స్కూల్ ఎంపికలు

- మహబూబ్‌నగర్ ప్రధాన స్టేడియంలో నిర్వహణ
- డీవైఎస్ఓ ఎస్.శ్రీనివాస్

మహబూబ్‌నగర్ క్రీడలు: రాష్ట్ర క్రీడాప్రాధికార సంస్థ (శాట్) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న హకీంపేట, కరీంనగర్, ఆదిలాబాద్ క్రీడా పాఠశాలల్లో 4వ, 5వ తరగతిలో ప్రవేశాల కోసం వచ్చే నెల 13న జిల్లాకేంద్రంలోని మెయిన్ స్టేడియంలో జిల్లాస్థాయి ఎంపికలు ఉంటాయని జిల్లా యువజన, క్రీడల అధికారి ఎస్.శ్రీనివాస్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. సెలక్షన్స్‌కు వచ్చే విద్యార్థులు 10 పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు, తహసీల్దార్ లేదా మున్సిపాలిటీ ద్వారా జనన ధ్రువీకరణ పత్రం, ప్రస్తుత పాఠశాల నుంచి స్టడీ సర్టిఫికెట్, 3, 4 తరగతుల ప్రోగ్రెస్ రిపోర్ట్, ఆధార్ కార్డు, కులం కమ్యూనిటీ సర్టిఫికెట్ ఒరిజినల్, రెండు సెట్ల జిరాక్స్ కాపీలతో ఉదయం 8 గంటలకు మెయిన్ స్టేడియంలో రిపోర్ట్ చేయాలని కోరారు. 4వ తరగతిలో ప్రవేశాల కోసం 8–9 సంవత్సరాలు 01.09.2014 నుంచి 31.08.2015, 5వ తరగతిలో ప్రవేశాల కోసం 9–10 సంవత్సరాలు 01.09.2013 నుంచి 31.08.2014 మధ్య జన్మించిన వారు అర్హులని పేర్కొన్నారు. ఎత్తు, ఫ్లెక్సిబిలిటీ టెస్ట్, స్టాండింగ్ బ్రాడ్ జంప్, 30 మీటర్ల ఫ్లయింగ్ స్టార్ట్, 800 మీటర్ల పరుగు పందెం, బరువు, వర్టికల్ జంప్, మెడిసిన్ బాల్ త్రో, 6, 10 మీటర్ల షటిల్ రన్ అంశాల్లో ఎంపిక పరీక్షలు ఉంటాయని తెలిపారు. మిగతా వివరాల కోసం 9440656162 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

రాష్ట్ర ప్రభుత్వం వృత్తి పన్ను రద్దు చేయాలి

ఇన్సూరెన్స్ ఏజెంట్స్ అసోసియేషన్ జాతీయ ప్రధానకార్యదర్శి శ్రీనివాసాచారి



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాసాచారి

జడ్చర్ల టౌన్: ఎల్ఐసీ ఏజెంట్ల నుంచి తెలంగాణ ప్రభుత్వం వసూలు చేస్తున్న వృత్తి పన్నును వెంటనే రద్దు చేయాలని, లేనిపక్షంలో ప్రభుత్వానికి వ్యతిరేకంగా భవిష్యత్ కార్యాచరణను రూపొందిస్తామని ఇన్స్యూరెన్స్ ఏజెంట్స్ అసోసియేషన్ జాతీయ ప్రధానకార్యదర్శి శ్రీనివాసాచారి హెచ్చరించారు. శనివారం స్థానిక వాసవీ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన గ్రామీణ ఏజెంట్ల శిక్షణ శిబిరానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై స్థానిక విలేకర్లతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్‌లో కోర్టు కేసు ఉన్నందున అక్కడి ప్రభుత్వం పన్ను వసూలు చేయటం లేదని.. తెలంగాణలో మాత్రం ప్రతిసారి ఠంచన్‌గా వసూలు చేస్తున్నట్లు వివరించారు. ఇప్పటికే తాము పలుమార్లు ప్రభుత్వంతో సంప్రదింపులు జరిపామని, పన్ను రద్దుచేయని పక్షంలో వ్యతిరేక కార్యక్రమాలు నిర్వహించాల్సి వస్తోందని హెచ్చరించారు. తమ ఏజెంట్ల వద్ద వసూలు చేసిన పన్నుతో రైతుబీమా ప్రీమియం చెల్లిస్తున్నారన్నారు. దేశంలో ఉన్న 13 లక్షల మంది ఏజెంట్ల అభివృద్ధి, సంక్షేమానికి లియాఫి నిరంతరం కృషి చేస్తుందని, దేశ ఆర్థిక వ్యవస్థకు పట్టుగొమ్మలుగా ఉన్న ఎల్ఐసీ ఏజెంట్ల హక్కుల పరిరక్షణకు తమ సంఘం పాటు పడుతున్నట్లు తెలిపారు. ఏజెంట్ల గ్రాట్యుటీ రూ.3 లక్షల నుంచి రూ.5 లక్షలకు పెంచాల్సిన అవసరం ఉందని.. ఇందుకోసం కేంద్రంతో చర్చిస్తున్నామని త్వరలోనే సానుకూల స్పందన వస్తుందని వివరించారు. విలేకరుల సమావేశంలో సంఘం ఆలిండియా ఉపాధ్యక్షుడు ఎంఎస్ మూర్తి, ఎస్‌డీఎం రాజీబ్ విశ్వాస్, ఎంఎం వెంకటరమణ, ఎంఎస్ రాంచందర్, స్థానిక బ్రాంచ్ మేనేజర్ జగన్నాథ్ పాల్గొన్నారు.

ఎల్ఐసీ ప్రైవేటీకరణ ప్రచారాన్ని నమ్మొద్దు..

ఎల్ఐసీ ప్రైవేటీకరణ అంటూ సామాజిక మాధ్యమాల్లో జరుగుతున్న గ్లోబల్ ప్రచారాలను నమ్మొద్దని.. ఇన్స్యూరెన్స్ రంగంలో నేటికి ఎల్ఐసీ రారాజుగా కొనసాగుతుందని ఇన్స్యూరెన్స్ ఏజెంట్స్ అసోసియేషన్ జాతీయ ప్రధానకార్యదర్శి శ్రీనివాసాచారి స్పష్టం చేశారు. శనివారం స్థానిక వాసవి కల్యాణ మండపంలో నిర్వహించిన గ్రామీణ ఏజెంట్ల శిక్షణ శిబిరంలో ఆయన పాల్గొని మాట్లాడారు. 24 కంపెనీలు ఇన్స్యూరెన్స్ రంగంలోకి వచ్చినా ఎల్ఐసీతో పోటీలో నిలబడలేకపోయాయని.. దేశంలో రైల్వే తర్వాత అత్యధిక ఆస్తులు కలిగిన సంస్థగా గుర్తింపు పొందిందన్నారు. ఇలాంటి సమయంలో కొందరు స్వార్థపూరిత రాజకీయాల కోసం ఎల్ఐసీ ప్రైవేటీకరణ చేస్తారని ప్రచారం చేస్తున్నారని వాటిని నమ్మవద్దని కోరారు. ఎల్ఐసీ తన పెట్టుబడులు 95 శాతం ప్రభుత్వ గ్యారంటీ గల ప్రభుత్వరంగ సంస్థల్లోనే పెట్టుబడులు పెడుతున్నందున ఎలాంటి ఢోకా ఉండదన్నారు. ఎల్ఐసీ ప్రీమియంలపై జీఎస్టీ విధించటం పాలసీదారులకు భారంగా మారిన విషయాన్ని కేంద్రం దృష్టికి తీసుకెళ్లామని వివరించారు. మారుతున్న కాలానికి అనుకూలంగా ఏజెంట్లు తమ విజ్ఞానాన్ని పెంపొందించుకోవాల్సిన అవసరం ఉందని, వ్యాపారం అభివృద్ధి చేసుకొని తమ కుటుంబాలు, దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నుదన్నుగా నిలవాలని కోరారు. సమావేశంలో వక్త పీకే శ్రీనివాసన్, అసోసియేషన్ హైదరాబాద్ డివిజన్ అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, కార్యదర్శి సుదర్శన్, స్థానికులు రంగరాములు, రామచంద్రయ్య, సుదర్శన్, శ్రీనయ్య, 600 మంది ఏజెంట్లు పాల్గొన్నారు.

సివిల్ సర్వీసెస్‌కు శిక్షణ ఎంతో ముఖ్యం

21వ సెంచరీ ఐఏఎస్ సంస్థ చైర్మన్ కృష్ణప్రదీప్



మాట్లాడుతున్న కృష్ణప్రదీప్

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: సివిల్ సర్వీసెస్‌కు శిక్షణ ఎంతో ముఖ్యమని 21వ సెంచరీ ఐఏఎస్ సంస్థ చైర్మన్ క్రిష్ణప్రదీప్ అన్నారు. శనివారం సాయంత్రం జిల్లాకేంద్రంలోని ఓ ఫంక్షన్‌లో సంస్థ ఆధ్వర్యంలో అభ్యర్థులు, విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదోతరగతి ఉత్తీర్ణులైన వెంటనే ఆ దిశగా విద్యార్థులు ఆలోచించాలన్నారు. తమ సంస్థ హైదరాబాద్‌లోని అశోక్‌నగర్‌లో కార్పొరేట్ కార్యాలయం ఉందన్నారు. అలాగే విద్యార్థుల కోసం రంగారెడ్డి జిల్లా శంషాబాద్ సమీపంలోని రాళ్లగూడలో ఇంటిగ్రేటెడ్ క్యాంపస్ ఏర్పాటు చేశామన్నారు. ఇంటర్, డిగ్రీతో పాటు సివిల్ సర్వీసెస్ కోసం విద్యార్థులకు ఏకకాలంలో శిక్షణ ఇస్తామన్నారు. కనీసం అఖిలభారత స్థాయిలో వంద ర్యాంకులు సాధించడమే తమ లక్ష్యమన్నారు. ఐఏఎస్, ఐపీఎస్, గ్రూప్ వన్‌కు ప్రిపరేషన్ చాలా అవసరమన్నారు. తమ వద్ద చేరిన అభ్యర్థులకు తెల్లవారుజాము నుంచే స్టడీ అవర్స్ ఉంటాయన్నారు. ప్రముఖులందరూ ఈ సమయాన్ని ఉపయోగించునే జీవితంలో అత్యున్నతస్థాయికి ఎదిగారని పేర్కొన్నారు. విద్యార్థులపై బలవంతంగా ఏదీ చేయించొద్దన్నారు. భవిష్యత్‌లో ఏమి చదివితే బాగా ఉంటుందో మొదట తల్లిదండ్రులే అవగాహన కల్పించి ఆ దిశగా అడుగులు వేసేలా చూడాలన్నారు. అనంతరం విద్యార్థుల తల్లిదండ్రుల సందేహాలను ఆయన నివృత్తి చేశారు. కార్యక్రమంలో జాగ్రఫీ ఫ్యాకల్టీ వెంకటేశ్వర్లు, ఫిజికల్ డైరెక్టర్ చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

దాతలూ.. దయచూపండి

- ట్రాక్టర్ ప్రమాదంలో గాయపడి మంచానికి పరిమితమైన యువకుడు
- రోజువారి ఖర్చులకే రూ.వెయ్యి దాకా వెచ్చింపు
- నిరుపేద కుటుంబాన్ని చుట్టుముట్టిన కష్టాలు
- ఆర్థిక సాయం అందించాలని వేడుకోలు



తమ్ముడు శివకుమార్‌కు సేవ చేస్తున్న రాఘవేందర్

నవాబుపేట: ప్రమాదవశాత్తు జరిగిన సంఘటన ఆ యువకుడి జీవితాన్ని నరకప్రాయం చేసింది. కుటుంబానికి అండగా నిలవాల్సిన వయస్సులో మంచానికి పరిమితమై అదే కుటుంబానికి భారంగా మారాడు. చివరికి తోడబుట్టిన అన్నతో సపర్యలు చేయించుకుంటూ జీవచ్ఛవంలా కాలం వెళ్లదీస్తున్నాడు. కనీసం చికిత్స చేయించేందుకు ఆర్థిక స్థోమత లేని దుస్థితిలో దాతలు సహాయం చేసి ఆదుకోవాలని అర్థిస్తున్నాడు. మండలంలోని లింగంపల్లికి చెందిన చాకలి శివకుమార్ ఏప్రిల్‌లో గ్రామ పంచాయతీ ట్రాక్టర్‌పై వెళ్తుండగా జరిగిన ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. దీంతో అతడిని హైదరాబాద్‌లోని నిమ్స్‌కు తరలించగా.. వివిధ రకాల చికిత్స అనంతరం కుటుంబం ఖర్చు చేసే స్థోమత లేదని చెప్పడంతో డిశ్చార్జ్ చేశారు. అప్పటి నుంచి బెడ్‌పైనే ఉంటూ మూడు నెలలుగా నరకయాతన అనుభవిస్తున్నాడు. కనీసం లేవని స్థితిలో ఉండటంతో అతనికి అన్న రాఘవేందర్ నిత్యం సపర్యలు చేస్తున్నాడు. బాధితుడికి ఆర్థికంగా ఇబ్బందులు ఉండటంతో నిమ్స్‌లో దాదాపు రూ.లక్ష వెచ్చించినా మెరుగుపడకపోవడంతో ఇంటికి చేరారు. నిత్యం మందులు తదితర వాటికి రోజు వారి ఖర్చులు సైతం రూ.వెయ్యి వరకు అవుతుండటంతో ఆ కుటంబం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటుంది.

చిన్న వయస్సు నుంచే..

రాఘవేందర్ తల్లి నర్సమ్మకు పెరాలసిస్ ఉండటంతో దాదాపు నాలుగు సంవత్సరాలు సేవ చేసిన రాఘవేందర్ ఆమె మృతిచెందిన తర్వాత తండ్రికి గుండె సంబంధిత వ్యాధితో స్టంట్ వేశారు. అతనికి దాదాపు 6 నెలల పాటు సేవ చేసిన తర్వాత కోలుకున్నాడు. నాలుగు నెలల క్రితమే రాఘవేందర్ పెళ్లి చేసుకున్నాడు. పెళ్లి జరిగిన నెలన్నరకే తమ్ముడు శివ గ్రామ పంచాయతీ ట్రాక్టర్ ఎక్కి ప్రమాదంలో గాయపడ్డాడు. దీంతో అతడికి సేవ చేయాల్సిన పరిస్థితి వచ్చింది. నిత్యం ఇబ్బందుల్లో ఉన్న దాతలు కుటుంబానికి చేయూతనిచ్చి ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

పంటల సాగుపై శాస్త్రవేత్తల అవగాహన



అవగాహన కల్పిస్తున్న పాలెం వ్యవసాయ శాస్త్రవేత్తలు

తెలకపల్లి: గ్రామీణ దత్తత కార్యక్రమంలో భాగంగా ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం పాలెం శాస్త్రవేత్తలు శనివారం బొప్పల్లిని సందర్శించారు. మండల వ్యవసాయ అధికారి సందీప్‌కుమార్ ఆధ్వర్యంలో శాస్త్రవేత్తలు గ్రామ వివరాలు, భౌగోళిక స్థితిగతులు, పంటల సరళి, నీటి పారుదల, వసతులు, సామాజిక, ఆర్థిక స్థితిగతులు, సాగులో ఎదుర్కొంటున్న సమస్యలు తదితర వివరాలను రైతులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం నూనెగింజల ప్రధాన శాస్త్రవేత్త ఎస్.వాణిశ్రీ వానాకాలంలో అధిక దిగుబడులు పొందడానికి ఏయే పంటలు సాగుచేయాలి, నూతన వంగడాలు, సాంకేతిక పరిజ్ఞానం, ఏ నేలల్లో ఎలాంటి పంటలు వేసుకోవాలి తదితర విషయాలపై రైతులకు అవగాహన కల్పించారు. కీటక శాస్త్రవేత్త డా. శంకర్ వానాకాలం పంటల్లో పురుగు, తెగుళ్ల గుర్తింపు, యాజమాన్య పద్ధతుల గురించి వివరించారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు శ్రీధర్, అర్చన, శ్రీరాం, ఏఈఓ, సర్పంచ్ పరశురాములు, రైతులు పాల్గొన్నారు.

ఫిర్యాదులను పరిశీలించి పరిష్కరిస్తాం



ఫోన్‌లో ఫిర్యాదులు తీసుకుంటున్న ఆర్ఎం శ్రీదేవి

స్టేషన్ మహబూబ్‌నగర్: డయల్ యువర్ ఆర్ఎంకు వచ్చిన ప్రయాణికుల ఫిర్యాదులు, సూచనలను పరిశీలించి పరిష్కారం కోసం తగిన చర్యలు తీసుకుంటామని ఆర్టీసీ రీజినల్ మేనేజర్ శ్రీదేవి అన్నారు. జిల్లాకేంద్రంలోని ఆర్ఎం కార్యాలయంలో శనివారం సాయంత్రం 4 గంటల నుంచి 5 గంటల వరకు డయల్ యువర్ ఆర్ఎం కార్యక్రమం నిర్వహించారు. నారాయణపేట పాతబస్టాండ్‌లో షెల్టర్ ఏర్పాటు చేయడంతో పాటు నీటి సమస్యను తీర్చాలని, అప్పన్నపల్లి ఫ్లైఓవర్ బ్రిడ్జి వద్ద రిక్వెస్ట్ పాయింట్ ఏర్పాటు చేయాలని, కోస్గి డిపో నుంచి అదనంగా పల్లె వెలుగు బస్సులు నడపాలని కోరారు. అదేవిధంగా షాద్‌నగర్–దుప్పల్లి–ఆత్మకూర్ నైట్‌హాల్ట్, కేతేపల్లి–లోకుర్తి–ఆషన్‌పల్లి–దామర్‌గిద్ద నైట్‌హాల్ట్ సర్వీస్‌లను పునరుద్ధరించాలని కోరారు.

డయల్ యువర్ డీఎం

డయల్ యువర్ కార్యక్రమంలో భాగంగా డిపో మేనేజర్ సుజాత సాయంత్రం 3 గంటల నుంచి 4 గంటల వరకు ప్రయాణికుల నుంచి ఫోన్‌లో ఫిర్యాదులు తీసుకున్నారు. మహబూబ్‌నగర్ నుంచి నర్వ వరకు బస్సు నడపాలని, మహబూబ్‌నగర్ నుంచి నవాబ్‌పేట వరకు మరిన్ని బస్సులు నడపాలని ప్రయాణికులు కోరారు. దేవరకద్ర బస్టాండ్‌లో అన్ని బస్సులు ఆపాలని, కౌకుంట్ల–రాచాల మీదుగా హైదరాబాద్ వరకు బస్సు నడపాలని కోరారు.